
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



గుంటూరు జిల్లా వార్తలు

5

శనివారం 31 ఆగస్టు 2024



వనమహోత్సవంలో మొక్కలు నాటి నీరు పోస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పక్కన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా తదితరులు



అమ్మ పేరుతో.. చెట్టు పెంచండి

రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన వన మహోత్సవం ఉమ్మడి జిల్లాలో కోలాహలంగా జరిగింది. ప్రతి గ్రామంలోనూ ప్రజలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళగిరిలోని ఎకో పార్కులో ప్రారంభించారు. మొక్కలు నాటి స్థానిక ప్రజలతో మాట్లాడారు. మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలిలో మొక్కలు నాటారు. అదే విధంగా ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు అసలు వన మహోత్సవ కార్యక్రమం సీఎం నరసరావుపేటలో ప్రారంభించాల్సి ఉంది. స్థానిక అధికారులు దానికి తగిన ఏర్పాట్లు చేశారు. అయితే శుక్రవారం వర్షం కారణంగా, అక్కడ కార్యక్రమాన్ని రద్దు చేసి, మంగళగిరిలో నిర్వహించడం గమనార్హం.


- మంగళగిరి ఎకో పార్కుపై సీఎం ప్రశంసల జల్లు
- మేం అడిగితే ఆ చెట్టును చూపించి.. మీ అమ్మపేరు చెప్పండి
- రాజధాని అమరావతిలో అద్భుతమైన గ్రీన్ సిటీగా రూపొందిస్తాం
- సాగర్- శ్రీశైలం మధ్య దేశంలోనే అతిపెద్ద పులుల శాంక్చురీ
- అట్టహాసంగా మంగళగిరి ఎకో పార్కులో వన మహోత్సవం
- ఒక చెట్టు పదిమంది కొడుకులతో సమానం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- మొక్క ప్రగతికి చిహ్నం: కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని



● ప్రమాణం చేయించిన విద్యార్థినిని సన్మానించిన చంద్రబాబు, పవన్

గుంటూరు, మంగళగిరి ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'మంగళగిరి ఎకో పార్కును చూస్తే ఎంతో ఆనందం కలిగింది. సుందరమైన అడవి.. పక్కనే ప్రతిష్ఠాత్మకమైన ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎయిమ్స్ భవనాలు.. మరో పక్కన బెటాలియన్.. ఇవన్నీ చూస్తే ఎంతో అహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తోంది. అమరావతి నడిబొడ్డున ఇలాంటి అద్భుతమైన ఎకో పార్కు వుందంటే చాలా సంతోషంగా వుంది. నేను ఇంట్లో నుంచి బయటకు వస్తే మరో ప్రపంచానికి వచ్చినట్లుంది. ఈ వాతావరణం చూస్తే ఇక్కడే ఇల్లు కట్టుకోవాలనిపిస్తోంది. అంత సుందరంగా, కళ్లకు ఆకర్షణీయంగా ఈ పార్కు కనిపిస్తోంది.' అంటూ మంగళగిరి ఎకో పార్కుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసల వర్షం కురిపించారు. ఎకో పార్కులో ప్రస్తుతం రోజుకు 300 మంది వస్తున్నారని, రానున్న రోజుల్లో ఆ సంఖ్య 3000కు పెరగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భారీ వర్షాల కారణంగా నరసరావుపేట జేఎన్‌టీయూలో జరగాల్సిన కార్యక్రమాన్ని అప్పటికప్పుడు మంగళగిరిలోని ఎకో పార్కులో నిర్వహించారు. అప్పటికప్పుడు ఏర్పాటు కార్యక్రమం అయినప్పటికీ కార్యక్రమం ఎంతో అట్టహాసంగా సాగింది. కార్యాక్రమానికి అర్థగంట ముందే వచ్చిన రాష్ట్ర అటవీశాఖా మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎకో పార్కులో కలియదిరిగారు. తనను కలవడానికి ప్రయత్నించిన అభిమాను లు, ఉభయ పార్టీల కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. వారితో కలిసి తిరిగారు.

అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు రావడంతో ఆయనతో కలిసి ఎకో పార్కును పరిశీలించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే, అటవీశాఖ అధికారులు, మంగళగిరి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సం దర్భంగా నిర్వహించిన కార్యక్ర మంలో సంప్రదాయానికి భిన్నంగా సీఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో విద్యార్థులు వన మహోత్సవ ప్రమాణం చేయించారు. ప్రమాణం చేయించిన మంగళగిరి మున్సిపల్ హైస్కూలు చిన్నారిని ఆయన, పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తు వారిదే కాబట్టి వారి ద్వారా తాము ప్రమాణం చేశా మని ఈ సందర్భంగా చంద్రబాబు చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సభలో నవ్వులు పూయించారు. మారిన ముఖ్యమంత్రిగా చమత్కారాలతో అందరినీ అహ్లాదపరుస్తూ విద్యా ర్థులకు కర్తవ్యాలు బోధించారు. ప్రజలకు తమ బాధ్యతలు గుర్తుచేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, వ్యవస్థల విధ్వంసం, వైఫల్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్ర జలకు, ప్రధానంగా చిన్నారులకు మంచి భవిష్యత్తును హామీ ఇచ్చారు.



తల్లి రుణం తీర్చుకునేందుకు ఇదో అవకాశం

ఈ రోజు నుంచే ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటండి.. ఆ మొక్కకు తల్లిపేరు పెట్టండి. మనకు జన్మనిచ్చిన తల్లి రుణం తీర్చుకునేందుకు ఇది ఒక మంచి అవకాశం. నేను పవన్ కల్యాణ్ మళ్లీ మీ దగ్గరకి వస్తాం. అప్పుడు మీరు నాటిన మొక్కను మాకు చూపించాలి. పేరు అడిగితే మీ అమ్మపేరు చెప్పాలని చంద్రబాబు వన మహోత్సవం సందర్భంగా చిన్నారుల వద్ద హామీ తీసుకున్నారు. గత ముఖ్యమంత్రిలాగా రాళ్ల మీద తన బొమ్మ వేసుకోబోమని ఎద్దేవా చేశారు. ఎవరు నాటిన మొక్కకు వారే తమ తల్లి పేరు పెట్టుకోవచ్చని చమత్కరించారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ రెండేసి మొక్కలు నాటితే ఏడాదికి పది కోట్ల మొక్కలు అవుతాయన్నారు. తద్వారా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంకల్పించినట్లు 50 శాతం పచ్చదనాన్ని సాధించవచ్చన్నారు. ఆ కార్యక్రమాన్ని ఈ ఏడాది కోటి మొక్కలతో ప్రారంభిస్తున్నామన్నారు. తద్వారా ఏడాదికి 0.33 శాతం పచ్చదనం పెరుగుతుందని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో 32 కమ్యూనిటీ ఆధారిత ఎకోటూరిజం సెంటర్లు, 175 నియోజకవర్గాల్లో జపనీస్ టెక్నాలజీ, నరేగా డబ్బులు వినియోగించి నగర వనాలను నిర్మిస్తామన్నారు. తద్వారా పవన్ కల్యాణ్ చెప్పినట్లు 50 శాతం పచ్చదనం వస్తుందన్నారు. అదే అసలైన స్వర్ణాంధ్రప్రదేశ్ అన్నారు. పవన్ కల్యాణ్‌కు నిధుల కొరత లేదని, ఆయన చేతిలో నరేగా, అటవీ శాఖలు వున్నాయని, వాటి అనుసంధానంతో అడవుల పెంపకం ఎంతో సులువవుతుందన్నారు. ఇలాంటి మా కొత్త ఆలోచనలను కేంద్ర మంత్రి పెమ్మసాని సాకారం చేసే దిశగా కేంద్రంలో కృషి చేయాలన్నారు. నగర వనాల నిర్మాణాల్లో భాగమయ్యేం దుకు ముందుకు వచ్చేవారి సహాయం తీసుకుంటా మన్నారు.

● పులులను చూడాలంటే పవన్ కల్యాణ్‌ను అడగాల్సిందే..

నాగార్జున సాగర్, శ్రీశైలం దగ్గర 5,300 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద పులుల శాంక్చురి వస్తుందని చంద్రబాబు చెప్పారు. అక్కడ 80 పులులు వుంటాయని, అద్భుతమైన సఫారీని నిర్మిస్తామని ఆయన తెలిపారు. పులులను చూడాలంటే ఎక్కడికో వెళ్లాల్సిన పనిలేదని నాగార్జున సాగర్ వెళ్లి పవన్ కల్యాణ్‌ను తలుచుకుంటే చాలని చమత్కరించారు. రాష్ట్రంలో 13 వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, మూడు నేషనల్ పార్కులు, రెండు జూలాజికల్ పార్కులు వున్నాయని, ఒక టైగర్ పార్కు, ఒక ఏనుగుల శాంక్చురి వచ్చే అవకాశం వుందని చెప్పారు.





ప్రమాణం చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని, కలెక్టర్ నాగలక్ష్మి

ఒక చెట్టు పది మంది కొడుకులతో సమానం: డిప్యూటీ సీఎం పవన్

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ అటవీ శాఖ మంత్రిగా తనకు ఈ కార్యక్రమం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వరుణ దేవుడు కూడా తన శుభాశీస్సులు అందించారన్నారు. హరితాంధ్రప్రదేశ్ సాధించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం తన బాధ్యత అన్నారు. చెట్లు నరకడం తేలికే.. పెంచడం కష్టమన్నారు. గత ముఖ్యమంత్రి వందల చెట్లు నరికేశాడని, తాము అలా కాదన్నారు. ప్రతి దేవాలయం, మసీదు, చర్చి, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు పెంచు తామన్నారు. ఒక చెట్టు పది మంది కొడుకులతో సమానమని అరణ్యసూక్తం చెప్పిందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ చెట్టును పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. జపాన్‌కు చెందిన మియావకి పద్ధతిలో అనతి కాలంలోనే దట్టమైన అడవులు పెంచవచ్చని, ఆ పుస్తకాలను అందరికీ అందుబాటులోకి తెస్తామన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ విత్తనం నాటిన తరువాత అది ఎన్నో అవాం తరాలను అధిగమించి మొక్కై, మహా వృక్షమై ఎదుగుతుందన్నారు. అది ప్రగతికి చిహ్నమన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అనంతరామ్, కలెక్టర్ నాగలక్ష్మి, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, గుంటూరు జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, టీడీపీ నేత తమ్మిశెట్టి జానకీ, స్థానిక ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



తెనాలి: ఎరుకలపూడిలో మొక్కలు నాటుతున్న మంత్రి మనోహర్

ఒక రోజు ముందే పింఛన్లు



- అవ్వాతాతల ఆనందం
- 2,56,890 మందికి రూ. 109.39 కోట్ల విడుదల
- పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

గుంటూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం సెలవుదినం కావడంతో పింఛన్‌దారులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఒక రోజు ముందుగానే పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. దీని దృష్ట్యా జిల్లాలోని పింఛన్‌దారులంతా నేటి ఉదయం ఆరు గంటలకే వారి ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి విజ్ఞప్తి చేశారు. శనివారం, సోమవారం (సెప్టెంబరు 2వ తేదీ) మాత్రమే పింఛన్ల పంపిణీ జరుగుతుందన్న విషయాన్ని పింఛన్‌దారులు గుర్తించాలని సూచించారు. జిల్లాలోని 17 మండలాలు, గుంటూరు నగరపాలకసంస్థ, తెనాలి, పొన్నూరు, మంగళగిరి - తాడేపల్లి నగరపాలకసంస్థ పరిధిలో మొత్తం 2,56,890 మంది పింఛన్‌దా రులకు రూ. 109.39 కోట్లను శుక్రవారమే ప్రభుత్వం విడు దల చేసింది. సచివాలయాల కార్యదర్శులు బ్యాంకుల నుంచి నగ దుని ఉపసంహరించుకొని శనివారం వేకువజాము నుంచే పంపిణీకి సిద్ధమ య్యారు. మొత్తం 4,810 మంది సిబ్బందిని పింఛన్ల పంపిణీకి నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఏ పని మీద అయినా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు కూడా స్వస్థలాలకు వచ్చి అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్ల పర్యవేక్షణలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పింఛన్ల పంపిణీ చేయాలని ఆదేశించారు.

6లో..



రైల్ ఓవర్ రైల్‌కు గ్రీన్ సిగ్నల్

- బొమ్మైపల్లి - బీబీనగర్ స్టేషన్లను కలుపుతూ 8.54 కి.మీ నిర్మాణం
- రూ.281 కోట్ల నిధులు అవసరమౌతాయని అంచనా
- బడ్జెట్‌లో రూ.20 కోట్ల కేటాయింపు

ముసురు పట్టిన నగరం


ఉదయం నుంచి వానే..వాన ● లోతట్టు ప్రాంతాలు జలమయం..



గుంటూరు, ఆగస్టు 30: అల్పపీడన ద్రోణి కారణంగా శుక్రవారం ఉదయం నుంచే ముసురు వాన పట్టుకుంది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు కురుస్తూనే ఉంది. జల్లులతో నగరం తడిసి ముద్దయింది. లోతట్టు ప్రాంతాలు జమలయ్యాయి. అల్పపీడన ద్రోణితో శుక్రవారం ఉదయం నుంచి ముసురు ప్రారం భమైంది. ఉద్యోగులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డా రు. తోపుడు బండ్ల వ్యాపారులు, దుకాణాలకు వ్యాపారాల్లేక వెలవెల బోయాయి. వర్షంతో నగరంలోని ప్రధాన ప్రాంతాలైన మూడు వంతెనల సెంటర్, అంకమ్మనగర్ ఆర్‌యూబీ, రైల్వే స్టేషన్, మార్కెట్ ఏరియా ప్రాంతాలు, పాతగుంటూరులోని లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి.

గణేష్ విగ్రహాల విక్రయ వ్యాపారుల గుండెల్లో వణుకు...

త్వరలో వినాయక చవితి వేడుకలు పురస్కరించుకొని విగ్రహాలు విక్రయించే వ్యాపారుల్లో తాజా వర్షం వణుకు పుట్టిస్తోంది. ఇప్పటికే గణేష్ విగ్రహాలను విక్రయించేందుకు కాకాని రోడ్డు, నల్లపాడు రోడ్డు, అమరావతి రోడ్డు ప్రాంతాల్లో భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. విగ్రహాలు తడిసిపోకుండా కాపాడుకునేందుకు ప్లాస్టిక్ కవర్లు కప్పేందుకు వ్యాపారులు ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వచ్చింది.



ఉద్యోగుల బదిలీలకు 15 వరకు గడువు పొడిగింపు

● జిల్లాలో పలు శాఖల్లో నేటికీ ప్రారంభం కాని ప్రక్రియ

గుంటూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీల గడువు తేదీని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. నేటికీ పలు శాఖల్లో కసరత్తు పూర్తి కాకపోవడంతో ఉద్యోగ సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు సెప్టెంబరు 15వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శనివారంతో బదిలీల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా మరో పక్షం రోజులు వాయిదా పడింది. ఈ నేపథ్యంలో నేటికీ సిఫార్సు లేఖలు తెచ్చుకోలేకపోయిన వారికి మరో పదిహేను రోజుల సమయం రావడంతో వారు తమ ప్రయత్నాలను తీవ్రతరం చేశారు. కాగా ఇతర జిల్లాల నుంచి సిఫార్సు లేఖలతో వచ్చే వారి కోసం, ఇక్కడి నుంచి బదిలీ కోరుకోని వారిని ఇబ్బంది పెట్టొద్దని ఉద్యోగ సంఘాల నాయకులు జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. క్లాస్-4 మొదలుకొని మండల స్థాయి వరకు బదిలీలు కోరుకుంటున్న ప్రతి ఉద్యోగి, అధికారి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లేఖలు తెచ్చుకుంటున్నారు. బదిలీ దరఖాస్తుతో పాటు ఈ సిఫార్సు లేఖలను జత చేసి పంపుతున్నారు. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. సిఫార్సు లేఖతో వచ్చిన వారు రేపటి రోజున అధికారుల ఆదేశాలు ఏమేరకు పాటిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.



ఒక పోస్టుకు ఇద్దరికి సిఫార్సు లేఖలు

జిల్లాలో కొన్ని కీలకమైన శాఖల్లో ఫోకల్ పాయింట్లలో పోస్టింగ్‌లకు విచిత్రమైన పరిస్థితి నెలకొంది. కొన్నది. ఉన్నది ఒక పోస్టు అయితే దానికి ఇద్దరికి ఒకే ఎమ్మెల్యే సిఫార్సు లేఖలు ఇచ్చారు. దాంతో ఎవరికి ఆ పోస్టు ఇవ్వాలో తెలియని పరిస్థితి నెలకొన్నది. కాగా సిఫార్సు లేఖల విషయంలో కొంత మంది భారీగానే సొమ్ము చేసుకొంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధుల వద్దకు తమ బంధువులు/స్నేహితులని చెప్పి సిఫార్సు లేఖ తీసుకొని ఉద్యోగుల వద్ద రూ. వేలు, లక్షల్లో ముడుపులు స్వీకరిస్తున్నారు.

ఆఫీసు బేరర్ పేరుతో బదిలీ లేకుండా చేసుకొంటున్నారు..

ఉద్యోగ సంఘాల ఆఫీ సు బేరర్లమంటూ చాలా మంది బదిలీలు లేకుండా చేసుకొంటున్నారు. గుర్తిం పు పొందిన ఉద్యోగ సంఘాలకు మాత్రమే అది కూడా మూడు విడతల్లో కలిపి తొమ్మిదేళ్ల పాటు బదిలీ నుంచి మినహాయింపు పొందవచ్చు. ఈ నిబంధనని అడ్డు పెట్టుకొని ఏదో ఒక సంఘం పేరుతో వచ్చి తమకు గుర్తింపు ఉందని చెబుతూ బదిలీ నుంచి మినహాయింపు ఇవ్వాలని లేఖలు అందజేస్తున్నారు. వీరికి కొంతమంది అధికారుల అండదండలు కూడా ఉండటంతో బదిలీల నుంచి తప్పించుకొంటున్నారు.

చంద్రబాబు.. పవన్ పర్యటన రద్దు



జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీరు

నరసరావుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలించకపోవడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నరసరావుపేటలో శుక్రవారం పర్యటన రద్దు అయింది. తెల్లవారుజాము నుంచి వర్షం కురవడంతో కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో వనమహోత్సవం నిర్వహణకు ఆటంకం ఏర్పడింది. దీంతో వారి పర్యటన రద్దయింది. సభా ప్రాంగణంలో నీరు నిలిచిపోయింది. ఆ ప్రాంతమంతా బురదమయంగా మారింది.

అప్పు డబ్బు కోసం మౌన పోరాటం

చిలకలూరిపేట, ఆగస్టు 30: కష్టపడి సంపాదించుకున్న డబ్బు చిలకలూరిపేటలోని ఓ సెంటర్ భాగస్తులకు అప్పుగా ఇచ్చాం, ఆ అప్పును తిరిగి తీర్చమంటే వారు తమపైనే ఎదురుదాడి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల తరపున పెద్దమనిషిగా వ్యవహరించిన పట్టణ ప్రముఖులు తేలప్రోలు వీరయ్య శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఈ సెంటర్ ప్రధాన భాగస్తుడు అమెరికాలో స్థిరపడి తమను వేధిస్తున్నారని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. మొత్తం 15 మంది అప్పు ఇచ్చామని, అది ఇప్పుడు రూ. 8.5 కోట్లకు చేరుకున్నదని వివరించారు. ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వమంటే ఎన్ఆర్ఐలను వేధిస్తున్నారంటూ ఎదురు దాడి చేస్తున్నారని వాపోయారు. వారి ఆస్తులు కబ్జా చేస్తున్నామని సోషల్ మీడియాలో విస్తృతంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా తెలుగుదేశం పార్టీకి చెందిన వారిమి కావడంతో ఈ విషయాన్ని పార్టీ దృష్టి కూడా తీసుకెళ్లామని చెప్పారు. వాస్తవాలు ప్రజలకు తెలియజేసేందుకు సెంటర్ వెలుపల తాము మౌన పోరాటం చేస్తున్నామని చెప్పారు. టీడీపీకి చెందిన వారికి అన్యాయం జరుగుతున్నందున ప్రజాప్రతినిధులు న్యాయం చేయాలని విన్నవించారు.

విద్యుదుత్పత్తి నిలిపివేత..

రెంటచింతల, ఆగస్టు 30: నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 14 గేట్లను 4 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 2,85,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 2,93,000 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. విద్యుదుత్పత్తిని పూర్తిగా నిలిపివేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.19 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.2020 టీఎంసీలకు సమానమన్నారు.

రైల్ ఓవర్ రైల్‌కు గ్రీన్ సిగ్నల్

- బొమ్మైపల్లి - బీబీనగర్ స్టేషన్లను కలుపుతూ 8.54 కి.మీ నిర్మాణం
- రూ.281 కోట్ల నిధులు అవసరమౌతాయని అంచనా
- బడ్జెట్‌లో రూ.20 కోట్ల కేటాయింపు



రైల్ వోవర్ రైలు నమూనా

గుంటూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఒక రైల్ ఓవర్ రైల్(ఆర్‌వోఆర్) రానున్నది. నడికుడి మార్గంలో సికింద్రాబాద్‌కు వెళ్లే రైళ్లు, అటు నుంచి ఇటుగా వచ్చే రైళ్లకు పగిడిపల్లిలో సిగ్నల్ క్లియరెన్స్ సమస్యలు తలెత్తుతోన్నాయి. ఇక్కడే రైళ్ల హ్యాండింగ్ వోవర్ జరుగుతుంది. మెయిన్ లైన్‌లో ఏదైనా రైలు వస్తుందంటే దానికి ప్రిసిడెన్స్ ఇచ్చి ఈ మార్గంలో రైలుని నిలిపేస్తున్నారు. దీని వలన కొంత సమయపాలన దెబ్బతింటుంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రైల్వే శాఖ ఆర్‌వోఆర్‌ని మంజూరు చేసింది. కేంద్ర బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించిన దరిమిలా ఈ ఆర్థిక సంవత్సరంలోనే టెండర్ల ప్రక్రియ పూర్తియి పనులు ప్రారంభమౌతాయని రైల్వేవర్గాలు తెలిపాయి.

రైళ్లను నిలుపుదల చేయాల్సిన అవసరం ఉండదు

బీబీనగర్ - గుంటూరు రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు పనులు కూడా త్వరలో ప్రారంభం కాబోతోన్నాయి. ఈ నేపథ్యంలో కీలకమైన బీబీనగర్ - బొమ్మైపల్లి రైల్ ఓవర్ రైల్(ఆర్‌వోఆర్)ని త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే శాఖ భావిస్తుంది. మొత్తం 8.54 కిలోమీటర్ల పొడవునా ఈ ఆర్‌వోఆర్‌ని నిర్మించాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.281 కోట్ల నిధులు ఖర్చు అవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ బడ్జెట్‌లోనే రూ.20 కోట్లను కేంద్ర రైల్వే శాఖ కేటాయించింది. ఈ ఆర్‌వోఆర్ నిర్మాణం జరిగితే పగిడిపల్లి వద్ద క్లియరెన్స్ కోసం రైళ్లను నిలుపుదల చేయాల్సిన అవసరం ఉండదు. నేరుగా కాజీపేట - సికింద్రాబాద్ మార్గంలోకి ప్రవేశించి అక్కడి నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లిపోవచ్చు. ప్రస్తుతం పగిడిపల్లి వద్ద కొన్ని సందర్భాల్లో 10 నిమిషాల నుంచి అరగంట పాటు కూడా నడికుడి నుంచి వెళ్లిన రైళ్లు నిలిచిపోతున్నాయి. దీంతో నిర్ణీత సమయానికి రైళ్లు సికింద్రాబాద్ చేరుకోలేకపోతున్నాయి.

సమయం ఆదా..

గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ పూర్తి చేసినా ఈ ఆర్‌వోఆర్ నిర్మించకపోతే పెద్దగా ఉపయోగం ఉండదు. దీనిని పరిగణనలోకి తీసుకొనే రైల్వే శాఖ ఆర్‌వోఆర్‌ని రైల్వే బోర్డుకు ప్రతిపాదించి మంజూరు చేయించింది. ఆర్‌వోఆర్ వలన కింద ఒక రైలు మార్గం, పైన ఒక రైలు మార్గం ఉంటుంది. దాంతో ఎలాంటి అడ్డంకులు లేకుండా పగిడిపల్లి జంక్షన్‌లో అటు కాజీపేట నుంచి వచ్చే రైళ్లు, ఇటు నడికుడి మార్గం నుంచి వచ్చే రైళ్లు ప్రయాణించగలవు. తద్వారా సమయం ఆదా అవుతుంది.

అనంత భావజాలికుడు చంద్రబాబు

- విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ
- ఘనంగా చంద్రబాబు ఎక్స్‌వో పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో డాక్టర్ కె.లక్ష్మీనారాయణ, డాక్టర్ కేవీ సత్యనారాయణ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 30: పారిశ్రామిక, క్షీర, హరిత విప్లవం అంటూ నిత్యం ఆలోచించి వాటిని ఆచరణలో పెట్టిన అనంత భావజాలికుడు చంద్రబాబు అని విశ్రాంత ఐఏ ఎస్ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ అన్నారు. 'చంద్రబాబు ఎక్స్‌వో ది ఫౌంటైన్ ఆఫ్ క్రియేటివిటీ' ఆంగ్ల పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని గుంటూరు కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో శుక్రవారం నిర్వహించారు. సభకు కమ్మ జన సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. ప్రతి వ్యక్తి కుటుంబానికి సమయం ఇవ్వాలనే చంద్రబాబు ఆలోచనను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. విద్యార్థులు పత్రిక, పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. మరో విశిష్ట అతిథి, పుస్తక ఆంగ్ల అనువాద రచయిత డాక్టర్ కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగాల కోసం వెంపర్లాడే స్థితి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి తెలుగుజాతి ఎదగడం చంద్రబాబు దార్శనికత ఫలితమేనని తెలిపారు. 30 నుంచి 300 వరకు ఇంజినీరింగ్ కళాశాలను పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రెరా మాజీ చైర్మన్ డాక్టర్ వెలమాటి రామనాథ్ మాట్లాడుతూ విజన్- 47 ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేసిన నిత్య కృషీ వలుడు చంద్రబాబు అని కొనియాడారు. ఈ పుస్తకాన్ని రాజకీయ కోణంలో కాకుండా ఒక గొప్ప భవిష్యత్తు దార్శనికుని జీవనయానంలోని ప్రస్తుత సమాజానికి, మానవాళికి ఉపయుక్తమైన సంఘటనల సమాహారంగా పరిగణించాలని కోరారు. వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రస్తుత తరంలో ఆలోచించే రాజకీయ నాయకుడు చంద్రబాబు ఒక్కరేనని కొనియాడారు. సభలో పుస్తక రచయిత శాఖమూరు శ్రీనివాస ప్రసాదు, కేజేఎస్ ఎస్ కార్యదర్శి చుక్కపల్లి రమేష్ ప్రసంగించారు. కార్యక్రమంలో కేజేఎస్ఎస్ పాలక వర్గ సభ్యులు, టీడీపీ నాయకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద నీరు



విద్యుత్ వెలుగుల్లో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి

గుంటూరు, తాడేపల్లి టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది ఎగువ భాగంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రకాశం బ్యారేజీకి భారీగా వరదనీరు వచ్చి చేరుతున్నది. శుక్రవారం రాత్రికి ఏ క్షణంలో నైనా 3,35,000 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉందని కృష్ణానది సంరక్షక విభాగం నుంచి జిల్లా యంత్రాంగానికి సమాచారం అందింది. దీని దృష్ట్యా బ్యారేజి ఎగువ, దిగువన నదీపరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వరద ప్రవాహం వద్దకు వెళ్ల రాదని విజ్ఞప్తి చేశారు. పశువులను కూడా నది వద్దకు తీసుకెళ్లొదన్నారు. ఎలాంటి సమస్య తలెత్తినా కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నంబరు. 08632234014ని సంప్రదించాలని సూచించారు. తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తుండాలన్నారు. నదిలో వరదనీరు ఉధృతి కారణంగా లోలెవల్ చప్టాల వద్ద ప్రమాదకరంగా నీరు ప్రవహించే అవకాశం ఉన్నందున వాటి వద్ద పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

డెల్టా కాలువలకు 13,563 క్యూసెక్కులు నీరు

పులిచింతల ప్రాజెక్టు నుంచి 3,36,169 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం (రాత్రి వరకు) ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 67 గేట్లను 8 అడుగులు, 3 గేట్లను పూర్తిగా ఎత్తి దిగువకు 3,22,606 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 13,563 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ తెలిపారు. కాగా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత క్రమేపీ వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని జేఈ తెలిపారు.

రైతుల ఆదాయ వనరులు పెంచండి

- నకిలీ విత్తనాల చలామణిని అరికట్టండి
- వ్యవసాయ శాఖ సమీక్షలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'రైతులకు ఆదాయ వనరులు పెంచే విధంగా వారిని చైతన్యవంతం చేయండి. వాణిజ్య పంటలపై అవగాహన పెంచి రైతులను ప్రోత్సహించండి.' అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గుంటూరులోని ఎంపీ కార్యాలయంలో శనివారం వ్యవసాయ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వపరంగా అందే సేవల్లో ఎలాంటి లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. రైతులకు పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, వారి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. పంటలకు సాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, చీడపీడలపై రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎరువుల కొరత సమస్యను అధికారులు పెమ్మసాని దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విజయకీలాద్రిపై వైభవంగా శ్రావణ శుక్రవారం



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న వెంకటాచార్యులు దంపతులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 30: వేద విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు శ్రీత్రిదండి చినజీయర్ స్వామి మంగళాశాసనములతో సీతానగరంలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై 4వ శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా జరిగాయి. తొలుత చిన్నజీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అష్టలక్ష్మి అమ్మవారికి తిరువంజనసేవ, అలంకరణ, అష్టోత్తర శతనామార్చన, శ్రీసూక్త హవనం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర బిల్వార్చన, కదంబ పుష్పాలంకరణ, నివేదన నక్షత్ర హారతి సేవ, మంగళాశాసనములతో చివరి శ్రావణ శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు అనంత స్వామి, వేద విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, ఆగస్టు 30: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా శుక్రవారం అధికారులు నీటిని విడుదల చేశారు. 8 గేట్లను 10 అడుగులు, 18 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,62,430 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం 589.00 అడుగులు ఉంది. ఇది 309.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,633 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,354 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్ల ద్వారా 2,61,430, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 3,12,097 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,12,097 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

కారు, స్కూటర్ ఢీ : ఉపాధ్యాయిని మృతి



డీవీ రత్నకుమారి

ఫిరంగిపురం, ఆగస్టు 30: కారు, స్కూటర్‌ను ఢీకొనగా ఉపాధ్యాయిని మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం మండలంలోని గుంటూరు - నరసరావుపేట రహదారి పై నుదురుపాడు వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం నాదెండ్ల మండలం తూబాడు హైస్కూల్‌లో ఇంగ్లిషు ఉపాధ్యాయునిగా పని చేస్తున్న దంటు వెంకట రత్న కుమారి(45) సాయంత్రం 5 గంటలకు స్కూటీపై ఫిరంగిపురం వస్తుండగా నరసరావుపేట వైపు నుంచి గుంటూరు వెళ్తున్న కారు అతి వేగంగా నడపటం వలన ఉపాధ్యాయిని వెళ్తున్న స్కూటీని వెనుక నుంచి ఢీకొంది. ఉపాధ్యాయిని రత్నకుమారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలు ఫిరంగిపురంలో నివాసం ఉంటున్నారు. మృతురాలి భర్త అంకిరెడ్డి నరసరావుపేటలో ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులుగా పని చేస్తున్నారు. వీరికి ఒక కుమార్తె. సంఘటనా స్థలాన్ని సీఐ డి.రవీంద్రబాబు, ఎస్ఐ సదాశివరావు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

నకిలీ కరెన్సీ కేసులో జైలు శిక్ష

ఈపూరు, ఆగస్టు 30: నకిలీ కరెన్సీ నోట్లు కేసులో ముద్దాయికి 3 ఏళ్ల 6 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పినట్లు ఈపూరు ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. 2019 ఆగస్టు 24న ఈపూరు మండలం వనికుంట గ్రామంలో కూల్‌డ్రింక్ షాపులో ముగ్గురు యువకులు కూల్‌డ్రింక్ తీసుకొని రూ.500 నోటు ఇచ్చారు. షాపు యజమాని కాశీమల్ల నాగ రాజు ఆనోటును పరిశీలించి నకిలీదిగా గుర్తించి ఆ యువకులను ప్రశ్నించాడు. దీంతో వారు ఏమి మాట్లాడకుండా అక్కడ నుంచి పారిపోయారు. వెంటనే సదరు షాపు యజమాని నాగరాజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ జి.గిరిబాబు కేసు నమోదు చేశారు. అప్పటి వినుకొండ సీఐ ఎంవీ సుబ్బారావు కేసును దర్యాప్తు చేసి రొంపిచర్ల మండలం సంతగుడిపాడుకు చెందిన వర్ల చిరంజీవిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నర్సరావుపేట ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి ఎ.పూర్ణిమ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వర్ణలత భాను వాదనలు వినిపించారు.

పులిచింతల ప్రాజెక్టులో 42.16 టీఎంసీల నీరు

అచ్చంపేట, ఆగస్టు 30: పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,71,624 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 13 గేట్ల ద్వారా 3,11,345 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువకు విడుదల అవుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	103. 111.122
చికెన్ విత్ స్కిన్	196.00
చికెన్ స్కిన్ లెస్	206.00

51,315 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 44,587 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 51,315 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 15,619 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	17500	334	8500	14500
నెంబరు. 5	9000	12500	నెంబరు. 5	12000	12000
273	10500	14500	273	10500	13500
341	9000	16500	341	8000	15000
4884	11400	11400	4884	10000	13500
సూపర్ 10	8500	9000	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18500	తేజ	8000	18700
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	9000	14000
దేవనూరు డీలక్స్	8500	13000	దేవనూరు డీలక్స్	9500	14000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	10500

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

31నే నూరు శాతం పింఛన్ల పంపిణీకి కార్యాచరణ

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 30 : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 58,798 మంది పెన్షనర్లకు 31వ తేదీనే నూరు శాతం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేయడానికి తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్‌కు సంబంధించిన పింఛన్ల పంపిణీని శనివారం నాడే నూరు శాతం పూర్తి చేసేందుకు వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలిపారు. గుంటూరునగరంలోని 206 వార్డు సచివాలయాల పరిధిలోని వివిధ కేటగిరిలకు సంబంధించి 58,798 మంది పెన్షనర్లకు రూ.25,04,20,000 ను వారి ఇంటి వద్దనే 1410 మంది వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. పెన్షన్‌ల పంపిణీ సజావుగా జరిగేలా పర్యవేక్షణకు ముగ్గురు డిప్యూటీ కమిషనర్లన ఆధ్వర్యంలో 42 మంది నోడల్ అధికారులను నియమించిట్లు తెలిపారు. పెన్షన్ పంపిణీ ఉదయం 6 గంటల నుండే ప్రారంభించాలని పేర్కొన్నారు.

జీఎంసీలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు

వాతావరణ శాఖ సూచనల మేరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, గుంటూరు నగరంలో వర్షాల వలన ప్రజలకు ఇబ్బందులు తలెత్తితే తక్షణ స్పందన కోసం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 24/7 పని చేసేలా ప్రత్యేక కాల్ సెంటర్ (0863-2345105 లేదా 98499 08391 కు వాట్స్ అప్) ని ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. సదరు కాల్ సెంటర్ ద్వారా అందే ఫిర్యాదులపై సంబంధిత విభాగాధికారులు తక్షణం స్పందించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. వర్షాలకు డ్రైన్‌లు పొంగే అవకాశం ఉన్నందున కల్వర్ట్‌ల వద్ద, అవుట్ ఫాల్ డ్రైన్లలో వ్యర్థాలు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజారోగ్య అధికారులకు, గాలులకు చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడితే వెంటనే తొలగించేందుకు తగిన ఏర్పాట్లు, సిబ్బందితో ఏడిహెచ్ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో సమస్య రాకుండా, అవసరమైన ప్రాంతాల్లో జనరేటర్లు అందుబాటులో ఉంచేలా ఏఈలు బాధ్యత తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వే బెయిల్ అవుట్ చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. హెడ్ వాటర్ వర్క్స్ వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు.

నేడు ప్రత్యేక కౌన్సిల్ సమావేశం

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 30 : గుంటూరు నగరపాలక సంస్థ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కౌన్సిల్ సెక్రెటరీ శ్రీనివాసరావు తెలిపారు. నగర మేయర్ మనోహర్ నాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మొత్తం 30 అంశాలతో కూడిన ఎజెండాను రూపొందించినట్లు పేర్కొన్నారు.

యూనిఫైడ్ పెన్షన్ స్కీంపై యూటీఎఫ్ నిరసన

గుంటూరు(విద్య),ఆగస్టు 30: కేంద్ర ప్రభుత్వం తాజాగా తెరపైకి తెచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీంని అంగీకరించేది లేదని యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు అన్నారు. శుక్రవారం గుంటూరు తాలూకా కేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కంట్రిబ్యూషన్ చెల్లించే ఏ పెన్షన్ స్కీమును అంగీకరించేది లేదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ పాత పెన్షన్ సాధించేవరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావుకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వెంకటేశ్వర్లు, శివ పార్వతి, జిల్లా కమిటీ కన్వీనర్ ఆదినారాయణ, కో కన్వీనర్ షకీలా బేగం, జిల్లా కార్యదర్శులు వెంకటేశ్వర రావు, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ, వామపక్ష భావాల ఉద్యమనేత ఎన్‌వి నరసింహారావు

● శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు(విద్య), ఆగస్టు 30: అధ్యాపక ఉద్యమనేతగా, పౌర హక్కుల సంఘం, నిజమైన వామపక్ష భావజాలాలతో పౌర హక్కుల సంఘం నేతగా కడదాకా జీవించిన ఎన్‌వీ నరసింహారావు వర్తమాన, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయులని శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. జిల్లా చరిత్ర కాంగ్రెస్ సంఘం ఆధ్వర్యంలో పౌర సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్ వి నరసింహా రావు సంస్మరణ సభ శుక్రవారం స్థానిక బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య విద్యా సంస్థల సమావేశ మందిరంలో నిర్వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ తాను నమ్మిన ఆశయాల సాధన కోసం జీవితకాలం కృషిచేసిన మహనీయుడని నివాళులు అర్పించారు. అనంతరం చరిత్ర కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ సోమశేఖర రావు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా చరిత్ర కాంగ్రెస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎన్ శామ్యూల్, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎస్.సి బోస్, కార్యదర్శి డాక్టర్ మంచాల బోసు బాబు, సిఎస్ఆర్ ప్రసాద్, వి.లక్ష్మణరెడ్డి, సీనియర్ న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, కుటుంబ సభ్యులు లక్ష్మి, జ్యోతిర్మయి, సుధామయి పాల్గొన్నారు..

14న జాతీయ మెగా లోక్ అదాలత్

గుంటూరు, ఆగస్టు 30 : జిల్లాలో సెప్టెంబరు 14న జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా అంతటా ఉన్న కోర్టులలో జాతీయ మెగా లోక్ అదాలత్ జరగనుందని అన్నారు. కక్షిదారులు త్వరితగతిన తమ కేసులు పరిష్కారం కోసం రాజీ మార్గానికి మొగ్గు చూపాలని సూచించారు. ఇరు పక్షాల వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వీలైనంత వరకు ఎక్కువ కేసులను డిస్పోజల్ చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

● పేరేచర్ల నగరవనం వనమహోత్సవంలో జేసీ భార్గవ తేజ



పేరేచర్ల నగరవనంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న జేసీ భార్గవ తేజ

గుంటూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా ప్రతీ ఒక్కరూ గుర్తించాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ అన్నారు. పేరేచర్ల నగరవనంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన వన మహోత్సవంలో పాల్గొన్న ఆయన, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగ న్నాథ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలని, గ్లోబల్ వార్మింగ్ ఎదుర్కోవాలంటే ఫారెస్ట్ గ్రీన్ కవర్‌ను అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. చెట్లు నరకడం వంటి పనులు చేయకుండా ఆంధ్రప్రదేశ్‌ను పచ్చని తోరణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న, సర్పంచ్ దేవరకొండ రాజ్‌కుమార్, డీడీ సోషల్ వెల్ఫేర్ మధుసూధన రావు, జిల్లా ఉద్యాన అధికారి రవీంద్ర, డిఈఓ శైలజ, డీపీఓ కె.శ్రీదేవి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



నల్లచెరువు వాకింగ్ ట్రాక్ లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు (కార్పొరేషన్), ఆగస్టు 30 : రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం వనమహోత్సవాన్ని ప్రారంభించిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం స్థానిక నల్ల చెరువులోని వాకింగ్ ట్రాక్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ఈ మంచి పనికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు వీరారెడ్డి పాల్గొన్నారు.

హరిత గుంటూరుగా తీర్చిదిద్దాలి: ఎమ్మెల్యే గళ్లా మాధవి



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు నగరాన్ని హరిత గుంటూరుగా తీర్చిదిద్దాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా స్థానిక శ్రీరామ్‌నగర్‌లో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నగరంలో మొక్కల నాటడానికి పేరేచర్లలోని అటవీ శాఖ నుంచి 10 వేల మొక్కలను తీసుకున్నామని, రోడ్ మార్జిన్లలో నాటేందుకు వీలుగా 5 అడుగుల పైన ఉన్న 1000 మొక్కలను కడియం నర్సరీ నుంచి తెప్పించినట్లు చెప్పారు. వనమహోత్సవంలో పాల్గొని ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని పరిరక్షిస్తే పచ్చద నంతో నిండిన ఆరోగ్యకర గుంటూరు నగరం సాధ్యమవుతుందన్నారు.

ఆర్వీఆర్‌అండ్‌జేసీలో ఘనంగా వనమహోత్సవ్



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్

గుంటూరు(విద్య),ఆగస్టు 30: స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవం నిర్వహించారు. హరితాంధ్రప్రదేశ్ నిర్మాణంలో విద్యార్థులు భాగ స్వాములవ్వాలని ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు, కళాశాల మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ డి.కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

వేధించిన నేతల రక్షణ కవచం పార్టీ ఫిరాయింపులు

● జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ్ రెడ్డి

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 30 : గతంలో భూకబ్జాలు, ఇసుక, మట్టి, మైనింగ్ దోపిడీలతో అరాచక పాలన చేసి, ప్రత్యర్థులను వేధించిన కొందరు రాజ కీయ నేతలకు ఆత్మరక్షణ కోసం రక్షణ కవచంగా పార్టీ ఫిరా యింపులు ఉపయోగపడతాయని, అధికార పార్టీల వైపు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిస్థితులను గమనించి నిజాయతి పరులైన, జనం కోసం కష్టపడిన వారిని మాత్రమే అధికార పార్టీలోకి తీసుకోవాలని కోరారు.ఓటర్లు తిరస్కరించిన వారిని అనేక తప్పులు చేసిన వారిని అధికార పార్టీలోకి ఆహ్వానిస్తే ప్రజాస్వామ్య ప్రక్రియను, ఓటర్ల తీర్పును అప హాస్యం చేసినట్లవుతుందని తెలిపారు.

రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకనే దుష్ప్రచారం

● ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు

గుంటూరు, ఆగస్టు 30: పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక కొందరు ఆమె కుటుంబంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు విమర్శించారు. మాధవి భర్తపై ఇటీవల చేసిన నిరాధారమైన విమర్శలను ఖండిస్తున్నామన్నారు. స్థానిక పట్టాభిపురం రోడ్డులోని కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమవు తున్న ఎమ్మెల్యేను, ఆమె కుటుంబాన్ని ఎవరేమన్నా సహించేది లేదన్నారు.

2న మెగా రక్తదాన శిబిరం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 30: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని సెప్టెంబరు 2న తలసేమియా బాధిత చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు సేవాసదన్ వ్యవస్థాపక అధ్యక్షులు మిరియాల ప్రసాదరావు, మిరియాల గోపి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అమరావతి రోడ్డులోని గుంటూరు అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, ఆసక్తి గల్గిన యువత ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా డేగల జన్మదిన వారోత్సవాలు

గుంటూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ జన్మదిన వారోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సెప్టెంబరు 5న డేగల పుట్టినరోజు నేపథ్యంలో డేగల యూత్ సునీల్, హనీఫ్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక గోరంట్లలోని స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కేక్ కట్ చేసి డేగలకు ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్, శివరాం, బాబూరావు, నిశంకరరావు, అమర్‌నాథ్, శేఖర్, సదా, ఆంజనేయులు, కుమార్, రవి పాల్గొన్నారు.

చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ 'బి ప్లస్' గ్రేడ్

గుంటూరు(విద్య),ఆగస్టు 30: స్థానిక చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ 'బి ప్లస్' గ్రేడ్ వచ్చినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో న్యాక్ పీర్‌టీమ్ కళాశాలలను సందర్శించి వివిధ విభాగాలు పరిశీలించారని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు,పూర్వ విద్యార్థులు కళాశాల కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(బెంగళూ రు) కళాశాలకు 2.62 సిజిపిఎతో న్యాక్ 'బి ప్లస్' గ్రేడ్ మంజూరు చేశారని, ఈ గుర్తింపు ఐదేళ్ల పాటు కొనసాగనుందని తెలిపారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్‌ను న్యాక్ కోఆర్డినేటర్ ఎ.రామకృష్ణ ప్రిన్సిపల్ శ్రీదేవికి అందజేశారు.

విద్యాసంస్థల బస్సులను ఇతర అవసరాలకు వినియోగిస్తే చర్యలు : డీటీసీ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 30: విద్యాసంస్థల బస్సులను ఇతర అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉప రవాణ కమిషనర్ షేక్ కరీం స్పష్టం చేశారు. శుక్రవారం డీటీసీ కార్యాలయంలో విద్యాసంస్థల యాజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కరీం మాట్లాడుతూ విద్యాసంస్థల బస్సులలో విద్యార్థులను మాత్రమే చేరవేయాలని, ఇతర అవసరాల కోసం వినియోగిస్తే సదరు బస్సులపై కాంట్రాక్టు క్యారేజీ బస్సులకు వర్తించే ట్యాక్సు వేస్తామని, బస్సును సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆర్టీవో గోపాల్, మోటారు వాహన తనిఖీ అధికారులు మల్లీశ్వరి, గంగాధర్, ప్రసాదు, సౌజన్య పాల్గొన్నారు.

వైసీపీకి మూకుమ్మడి రాజీనామాలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 30: మొండి బండ కుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పొగర్తి కృష్ణ వైసీపీకి రాజీనామా చేశారు. ఆయనతో పాటు పోకర్తి వాసు,పెద్దింటి కోటేశ్వరరావు, ఆయన అనుచరులు ఆ పార్టీకి శుక్రవారం రాజీనామా చేశారు. అనంతరం గుజ్జనగుండ్ల, తుఫాన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొండి బండ సామాజిక వర్గానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని నాడు జగన్ ఇచ్చిన మాటను తప్పారని విమర్శించారు. అందుకే వైసీపీకి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తన భవిష్యతు కార్యచరణను త్వరలోనే ప్రకటిస్తానన్నారు.

ఏపీసీపీడీసీఎల్ సీజీఎంగా మురళీకృష్ణయాదవ్



మురళీకృష్ణయాదవ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు

గుంటూరు, ఆగస్టు 30: ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎమ్)గా గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ఆవుల మురళీకృష్ణయాదవ్ నియమితుల య్యారు. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి ఆ సంస్థ సీఎండీ పి.రవి నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు వెలువడిన వెంటనే ఆయన విజయవాడలోని కార్పొరేట్ కార్యాలయంలో ఆపరేషన్ (ఓ అం డ్ ఎమ్) సీజీఎంగా బాధ్యతలు స్వీకరించారు. సీజీఎంగా ఉద్యోగోన్నతి పొందిన మురళీకృష్ణయాదవ్ శనివారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. కాగా, ఆయన రెండు రోజులు సీజీఎంగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు సంగడిగుంటలోని విద్యుత్ భవ న్‌లో పలు విభాగాల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు పుష్ప గుచ్ఛాలు, పూలమాలలతో ఆయన్ని ఘనంగా సత్కరించారు.

పోలీస్ మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం : ఏఆర్ డీఎస్పీ

గుంటూరు, ఆగస్టు 30 : పోలీస్ మృతుల కుటుంబాలకు, విశ్రాంత పోలీసులకు అండగా ఉంటామని ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్ హామీ ఇచ్చారు. జిల్లాలో చనిపోయిన పోలీసు కుటుంబాల సభ్యులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. పోలీస్ శాఖ పరంగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బెనిఫిట్స్ గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పోలీసు డిపార్ట్మెంట్ లో పని చేసి రిటైర్డ్ అయిన అధికారులు, సిబ్బందితో కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతకుమార్ మాట్లాడుతూ ఏ సమస్యలు ఉన్నా జిల్లా ఎస్పీని వారు నేరుగా సంప్రదించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో వేంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, డీపీఓ సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 30: స్థానిక అరండల్ పేటలోని శ్రీ అష్టలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో చివరి శ్రావణ శుక్రవారం పూజలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. అనంతరం వరలక్ష్మి అమ్మ వారికి 1100 బంగారు పుష్పాలు, కలువ పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సిద్ధార్థ నగర్ శ్రీ కనకమహాలక్ష్మి మందిరంలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. స్థానిక శ్యామలానగర్ లోని శ్రీ సీతారామ దేవస్థానంలో ప్రధాన పూజారి నరేంద్ర శై కృష్ణమాచార్యులు నిర్వహణలో సువాసినులచే శ్రావణ శుక్ర వార వ్రతాలను నిర్వహించారు.

● గుంటూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా పెదకాకాని శివాలయంలో భ్రమరాంబికా అమ్మవారికి నిర్వహించిన కుంకుమార్చన, లలితా పారాయణంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న విద్యార్థినులు

● గుంటూరు(విద్య),ఆగస్టు 30: స్థానిక వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శ్రావణ శుక్ర వారం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విజ్ఞాన్ యూనివర్సిటీ సిబ్బంది, పలువురు విద్యార్థులు సామూహిక వ్రత పూజలు చేశారు. కార్యక్రమం లో విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య భార్య లావు నిర్మల, యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

● గుంటూరు(విద్య),ఆగస్టు 30: భారతదేశంలో పండుగల రూపంలో ప్రజల్లో ఆరోగ్యం, ఐకమత్యం, నాగరికత ఇమిడి ఉండటంతో సంస్కృతీ సాంప్రదాయాలు అనాదిగా పరిడవిల్లుతున్నాయని ప్రజ్ఞ విద్యాసంస్థల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ అన్నారు. స్థానిక నగరంపాలెంలోని ప్రజ్ఞ విద్యా సంస్థల్లో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా పాఠశాలలో రంగురంగుల సాంప్రదాయ పట్టు పరికిణీలు, పావడాలు ధరించి విద్యార్థినిలు సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు..

వైసీపీ గుంతలను కూటమి ప్రభుత్వం పూడుస్తోంది: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ వైఫల్యంతో ఏర్పడిన గుంతలను కూటమి ప్రభుత్వమే పూడ్చాల్సి వస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక ఎల్‌ఆర్ కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయిన్లకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.48.6 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్రహ్మసాని శ్రీను, ఎం. శ్రీనివాసరావు, వజ్జా లక్ష్మి, రహంతులిసా, గోపి, రాంబాబు కలాంపాల్గొన్నారు.

వైసీపీ అక్రమాలు ఒక్కొక్కటీ వెలుగులోకి : దామచర్ల

గుంటూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళల పట్ల జరిగిన అరాచకాలు అంతా ఇంతా కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐపీఎస్ చదివిన అధికారులు ముంబై సినీ నటిని రాష్ట్రానికి తెచ్చి బెయిల్ రాని కేసులు పెట్టి జైల్లో మానసికంగా వేధించడం దారుణమన్నారు. కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, మేళం సైదయ్య పాల్గొన్నారు.

టీడీపీతోనే అంగన్వాడీల సంక్షేమం, అభివృద్ధి సాధ్యం : టీఎన్ఏటీయూ

గుంటూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అంగన్వాడీల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని తెలుగునాడు అంగన్వాడీ ట్రేడ్ యూనియన్ సభ్యులు కొల్లి లక్ష్మీ నరసమ్మ, గడ్డం అనంతలక్ష్మి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో టీఎన్ఏటీయూ ద్వారా రూ.4,200 ఉన్న జీతాన్ని రూ.10,500కు పెంచామన్నారు. జగన్ హయాంలో అంగన్వాడీలను వంచించారని విమర్శించారు. అంగన్వాడీల సమస్యలను టీఎన్ఏటీయూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హేమలత, మరియంబీ, కల్యాణి పాల్గొన్నారు.

జిల్లా స్పెషలాఫీసర్‌గా డాక్టర్ ఎ.మల్లికార్జున

గుంటూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమా లన్నింటిని జిల్లాలో పర్యవేక్షించేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషలాఫీసర్‌గా నియమించింది. ప్రస్తుతం బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎ.మల్లికార్జున (2012 సివిల్స్ బ్యాచ్) అధికారిని ప్రత్యేకాధికారిగా నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ ఆఫీసర్ వివిధ ప్రభుత్వ శాఖల హెచ్‌వోడీలు, జిల్లా అధికారులను సమన్వయం చేసుకొని ప్రతీ ఒక్క కార్యక్రమం వంద శాతం లక్ష్యం సాధించేలా చూడాలని సీఎస్ ఆదేశాలు జారీ చేశారు.

అంధ విద్యార్థులకు కళ్లజోళ్ళు పంపిణీ

గుంటూరు(విద్య),ఆగస్టు 30: తెలుగుభాషా దినోత్సవాన్ని పురష్కరించుకుని శుక్రవారం స్థానిక ఏసి కళాశాలలో అంధ విద్యార్థులకు జర్మన్ నుంచి తెప్పించిన కళ్లజోళ్ళు, పేద విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజస్, ఎఐఎల్‌సి మోడరేటర్ పరదేశీబాబు, కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ కనపాల జోసెస్ పాల్గొన్నారు.

మిలిటరీ స్కూళ్లలో 6, 9వ తరగతుల్లో ప్రవేశాలు



దేశవ్యాప్తంగా ఉన్న రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎంట్రెన్స్ టెస్ట్‌లో వచ్చిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

మిలిటరీ స్కూళ్లు ఉన్న ప్రాంతాలు, వాటి వివరాలు: చైల్(హిమాచల్ ప్రదేశ్), అజ్మీర్(రాజస్థాన్), ధోల్‌పూర్(రాజస్థాన్), బెల్గాం(కర్ణాటక), బెంగళూరు(కర్ణాటక). రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు బాలబాలికలకు విద్యా బోధన ఉంటుంది. వీటిలో రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, ఇతర వర్గాల పౌరుల పిల్లలు చదువుకోవచ్చు. ఈ పాఠశాలలను రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. ఇవి ఆంగ్ల మాధ్యమంలో నడిచే రెసిడెన్షియల్ పబ్లిక్ పాఠశాలలు.

- రాష్ట్రీయ మిలిటరీ స్కూల్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సెట్) 2025-26

అర్హతలు: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుం చి 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

▼ 9వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుం చి 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయోపరిమితి: 6వ తరగతిలో ప్రవేశం పొందడానికి 2025 మార్చి 31 నాటికి విద్యార్థి వయస్సు 10 నుంచి 12 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే 2010 ఏప్రిల్ 1 నుంచి మార్చి 2012 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి.

రిజర్వేషన్: రక్షణ విభాగాల సిబ్బంది పిల్లలు, అలాగే, ఇతర వర్గాల పౌరుల పిల్లలకు మాత్రమే కేటాయించారు.

ఎంపిక ప్రక్రియ: రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ఇతర రిజర్వేషన్లను అనుసరించి సీటు కేటాయిస్తారు.

ప్రవేశ పరీక్ష: పరీక్షలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.

పరీక్ష సబ్జెక్టులు

6వ తరగతి: ఇంటెలిజెన్స్(50 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్(50 మార్కులు), మేథ్స్(50 మార్కులు), ఇంగ్లీష్(50 మార్కులు). 5వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 20 మార్కులు.

9వ తరగతి: ఇంగ్లీష్(50 మార్కులు), హిందీ(20 మార్కులు), సోషల్ సైన్స్(30 మార్కులు), మేథ్స్(50 మార్కులు), సైన్స్(50 మార్కులు). 8వ తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్వ్యూకు 50 మార్కులు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 19

వెబ్‌సైట్: www.rashtriyamilitaryschools.edu.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/nuz8UXzలో చదవండి.

దిక్సూచి DIKSUCHI



ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ తదితర ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఏపీ పీజీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా వర్సిటీ నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు లభించవు.

కోర్సులు-స్పెషలైజేషన్‌లు

- **ఎంఏ:** ఇంగ్లీష్, తెలుగు, హిందీ, కూచిపూడి క్లాసికల్ డ్యాన్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, సోషియాలజీ, సోషల్ వర్క్, యోగా, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అప్లయిడ్ ఎకనామిక్స్, ఎకనామిక్స్, మేథమెటిక్స్
- **ఎంఎఫ్ఏ:** స్కల్ప్చర్, పెయింటింగ్, ప్రింట్ మేకింగ్
- మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్ఆర్ఎం)
- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ)
- మాస్టర్ ఆఫ్ కామర్స్(ఎంకాం)
- మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(ఎంపీఈడీ)

ఎమ్మెస్సీ: బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మెరైన్ బయాలజీ అండ్ ఫిషరీస్, కోస్టల్ ఆక్వా కల్చర్ అండ్ మెరైన్ బయోటెక్నాలజీ, మెరైన్ బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, హ్యూమన్ జెనెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, హోమ్ సైన్స్(ఫుడ్, న్యూట్రిషన్, డైటెటిక్స్), బోటనీ, జువాలజీ, అప్లయిడ్ మేథమెటిక్స్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, మెరైన్ జియోఫిజిక్స్, జియోఫిజిక్స్, ఫిజికల్ ఓషనోగ్రఫీ, మెటరాలజీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, కెమిస్ట్రీ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఫుడ్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, జియాలజీ, అప్లయిడ్ జియాలజీ, సైకాలజీ, జాగ్రఫీ, అప్లయిడ్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 4
- **కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 5
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో

బీవీఎస్సీ & ఏహెచ్

ఐకార్ ఆధ్వర్యంలోని ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐవీఆర్ఐ)- బీవీఎస్సీ & ఏహెచ్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఇందులోనే ఏడాది పాటు కంపల్సరీ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. మొత్తం 50 సీట్లు ఉన్నాయి. వీటిలో 45 రెగ్యులర్ సీట్లు, 8 పేమెంట్ సీట్లు(సూపర్ న్యూమరరీ) ఉన్నాయి. వీటిని నీట్ యూజీ 2024 ర్యాంక్ ఆధారంగా భర్తీ చేస్తారు. ఎన్ఆర్ఐ కోటా కింద రెండు సీట్లు(సూపర్ న్యూమరరీ) ప్రత్యేకించారు. వీటిని అభ్యర్థుల అకడమిక్ మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు. మిగిలిన అయిదు సీట్లను రోస్టర్ విధానంలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా భర్తీ చేస్తుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టుల్లో మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. నీట్ యూజీ 2024 అర్హత పొందాలి. ఇందులో నిర్దేశించిన కటాఫ్ కంటే ఎక్కువ మార్కులు తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 ఏళ్లు నిండి ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 18
- **మొదటి రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 26
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** సెప్టెంబరు 27
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 7
- **కోర్సు ప్రారంభం:** అక్టోబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** ivri.nic.in

నవ్య | చిత్రజ్యోతి

ఇక్కడ కూడా అలాంటి కమిటీ వేయాలి

మాలీవుడ్‌లో కొనసాగుతున్న కీచకుల అకృత్యాలను బయట పెట్టిన జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌ను హీరోయిన్ సమంత స్వాగతించిన విషయం తెలిసిందే. తెలుగు చిత్ర పరిశ్రమలోని లైంగిక వేధింపులపై తెలంగాణ ప్రభుత్వం కూడా దృష్టి సారించాలనీ, జస్టిస్ హేమ కమిటీ తరహాలో ఇక్కడ కూడా ఓ కమిటీ వేయాలని సమంత కోరారు. వేధింపులకు గురి కాకుండా తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం అప్పుడే మహిళా ఆర్టిస్టులకు ఉంటుందని ఆమె పేర్కొన్నారు. 'తెలుగు చిత్రపరిశ్రమలో మహిళలుగా మేమంతా జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌కు స్వాగతం పలుకుతున్నాం. అలాగే కీచకులపై పోరాటం చేస్తున్న డబ్ల్యూసీసీ చర్యలను అభినందిస్తున్నాం. మాలీవుడ్‌లో మహిళల హక్కుల కోసం డబ్ల్యూసీసీ విజయవంతమైన పోరాటం చేసింది' అని సమంత అన్నారు.



బాలకృష్ణ స్వర్ణోత్సవ సభకు అతిరథమహారథులు



నందమూరి బాలకృష్ణ నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. సెప్టెంబర్ ఒకటిన నోవాటెల్ హోటల్‌లో ఈ వేడుకలకు అతిరథమహారథులు హాజరవుతున్నారు. ఇప్పటికే ఎంతో మందికి ఆహ్వానాన్ని అందించారు. ఇంకా కొంతమందికి పిలుపులు వెళ్లలేదని వస్తున్న వార్తలపై శుక్రవారం సాయంత్రం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి క్లారిటీ ఇచ్చింది. కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'తెలుగు చిత్రపరిశ్రమలోని అన్ని శాఖలు కలసి ఈ వేడుకల్ని నిర్వహిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల మంత్రులు, కేంద్రమంత్రులు కూడా కార్యక్రమంలో పాల్గొంటారు. ఇతర భాషల సినీ ప్రముఖులు కూడా వస్తారు. ఫిజికల్‌గా ఎవరికైనా ఇన్విటేషన్ అందకపోయినా ఇదే మా వ్యక్తిగత ఆహ్వానంగా భావించి ప్రతి ఒక్కరూ పాల్గొనాలి' అని కోరారు. ఈ కార్యక్రమంలో చదలవాడ శ్రీనివాసరావు, సి.కల్యాణ్, మాదాల రవి, భరత్‌భూషణ్, ప్రసన్నకుమార్, శివబాలాజీ, పరుచూరి గోపాలకృష్ణ, అశోక్‌కుమార్, మాధవపెద్ది సురేశ్, అనిల్‌కుమార్ వల్లభనేని తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి సినిమాలో నటిస్తున్నా



● చిక్కబళ్లాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

మెగాస్టార్ చిరంజీవితో కలసి సినిమాలో నటించే అవకాశం లభించనుందని కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవికి తాను పెద్ద అభిమానినని అన్నారు. ఆయనకు తనపై ప్రేమ ఉందని అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు హైదరాబాద్‌లోని ఇంటికి పిలిపించి సన్మానం చేశారని అన్నారు. పవన్ కల్యాణ్ గెలిచినప్పుడు తాను ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపానని అన్నారు. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' సినిమా చేస్తున్నారని, అది ముగిశాక ప్రారంభమయ్యే మరో సినిమాలో తాను నటిస్తానని తెలిపారు. తన పాత్ర ఏమిటనేది భవిష్యత్తులో తెలుస్తుందని అన్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

శ్రీరంగపురంలో కల్యాణం

వనపర్తి జిల్లా శ్రీరంగపురంలోని రంగనాథ స్వామి ఆలయం మా కుటుంబానికి చాలా ప్రత్యేకం. సిద్ధార్థ్‌తో నా నిశ్చితార్థం అక్కడే జరిగింది. త్వరలో మా పెళ్లి కూడా అక్కడే జరుగుతుంది' అని కథానాయిక అదితీ రావ్ హైదరీ చెప్పారు. మార్చిలో వారిద్దరికీ నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. తమ ప్రేమ, పెళ్లి గురించి అదితీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పెళ్లి తేదీని పెద్దలు నిర్ణయిస్తారు, మేం ఇద్దరం కలసి ప్రకటిస్తామని చెప్పారు. 'మహాసముద్రం' సినిమా చిత్రీకరణ సమయంలో సిద్ధార్థ్, అదితీ ప్రేమలో పడ్డారు.



అవసరమైతే కోర్టుకు వెళ్తా



బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదల ముంగిట వివాదాల్లో చిక్కుకుంది. ఈ సినిమాను నిషేధించాలంటూ పలు సిక్కు సంఘాల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విధించిన అత్యయిక పరిస్థితి ఆధారంగా రూపుదిద్దుకున్న చిత్రమిది. ఇందిరా గాంధీ పాత్రను పోషించడంతో పాటు కంగనే ఈచిత్రానికి దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 06న 'ఎమర్జెన్సీ'ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు కంగన సన్నాహాలు చేశారు. అయితే ఇప్పుడు ఈ చిత్రం విడుదల సందిగ్ధంలో పడింది. తమ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని కంగన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. సినిమాను విడుదల చేసేందుకు అవసరమైతే న్యాయపోరాటం చేస్తానని ఆమె చెప్పారు. సినిమాలను విడుదల చేస్తే చంపేస్తామంటూ వస్తున్న బెదిరింపుల గురించి మాట్లాడుతూ 'నన్ను భయపెట్టాలని చూసినంత మాత్రాన చరిత్ర మారిపోదు కదా' అని కంగన అన్నారు. సంజయ్ గాంధీ పాత్ర పోషించిన విశాక్ నాయర్‌కు సైతం బెదిరింపులు వచ్చాయి.





ఇటీవల కర్నాటకలోని కూర్గ్‌లో వివాహం చేసుకుని ఒక్కటైన కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్ రిసెప్షన్ శుక్రవారంహైదరాబాద్‌లో జరిగింది. పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

అభిమానుల ప్రేమకు ఆనంద భాష్పాలు

అభిమానుల ప్రేమలో తడిసి ముద్దయ్యారు హాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఏంజెలీనా జోలీ. వెనీస్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ఆమె నటించిన 'మరియ' చిత్రం ప్రత్యేక ప్రదర్శనకు హాజరయ్యారు. షో పూర్తవ్వగానే అందరూ లేచి నిలబడి కరతాళ ధ్వనులతో ఆమె నటనను అభినందించారు. దాదాపు ఎనిమిది నిమిషాల పాటు థియేటర్ అంతా మార్మోగింది. తనపై అభిమానులు చూపుతున్న ప్రేమతో ఉద్వేగానికి లోనైన ఏంజెలీనా కన్నీళ్లను ఆపలేకపోయారు. సహనటుడు ఫెయర్స్ ఫావినో ఆమెను సముదాయించారు. అభిమానులకు ఏంజెలీనా ధన్యవాదాలు తెలిపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో ఎన్నో కష్టాలు అనుభవించి ఆమె ఈ స్థాయికి చేరుకున్నారు అని అభిమానులు ఏంజెలినాను ప్రశంసిస్తున్నారు.

టీవీ రంగంలోనూ లైంగిక వేధింపులు

● సీనియర్ నటి కుట్టిపద్మిని



తమిళ చిత్రసీమతోపాటు టీవీ రంగంలోనూ మహిళలపై లైంగిక వేధింపులకు కొదువలేదని సీనియర్ నటి కుట్టిపద్మిని ఆరోపించారు. ఓ తమిళ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. సినిమాల్లోనే కాదు టీవీ సీరియల్స్‌లో నటించే యువతులు కూడా లైంగిక వేధింపులకు గురవడం సహజంగా మారిపోయింది. అలా వేధింపులకు గురయ్యేవారు సమాజానికి భయపడి ఎవరికీ ఫిర్యాదు చేయడం లేదు. పారితోషికాలు పెద్ద మొత్తంలో లభిస్తుండటంతో కొంతమంది ఈ లైంగిక వేధింపులను భరిస్తున్నారు. ఫిర్యాదు చేసేవారికి మళ్లీ సినిమాల్లో నటించే అవకాశాలు లభించడం లేదు. నటుడు సురేశ్ గోపీపై వస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఎక్కడున్నాయంటూ కొంతమంది అడుగుతున్నారు, ఆధారాలు ఎవరిస్తారు?' అని ఆమె ప్రశ్నించారు. దీనికి సీబీఐ విచారణ లాగా లై డిటెక్టర్లతో పరీక్షల చేయడం మినహా మరో మార్గం లేదన్నారు. దర్శకులు, సాంకేతిక నిపుణుల నుండి మహిళలు లైంగిక వేధింపులకు గురవుతూనే ఉన్నారని, అవి భరించలేక ఎంతోమంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని కుట్టి పద్మిని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

మంచి బ్రేక్ కోసం ఎదురు చూస్తున్నా



తెలుగు సినిమాల్లో తండ్రి పాత్రలు దాదాపు ఒకేలా ఉంటున్నాయి. అయినా తనకు ఇచ్చిన పాత్రల్లో వైవిధ్యం చూపించడానికి కృషి చేస్తున్నారు నటుడు ఆనంద చక్రపాణి. 'దాసి' చిత్రంతో తొలిసారిగా తెరపై కనిపించి లాంగ్ గ్యాప్ తర్వాత మళ్లీ 'మల్లేశం' సినిమాలో తండ్రి పాత్రతో ఎంట్రీ ఇచ్చారు. ఒకే ఒక్క ఛాన్స్ జీవితాన్ని మలుపు తిప్పుతుందని చాలా సందర్భాల్లో నిజమైన విషయం. అలాగే 'మల్లేశం' చిత్రం ఆనంద చక్రపాణి కెరీర్‌ని మలుపు తిప్పింది. ఇప్పటికి 45పైగా చిత్రాల్లో నటించేలా చేసింది.. అవన్నీ విభిన్న పాత్రలు కావడం తన అదృష్టం అంటూ ఆనంద చక్రపాణి చెప్పిన విశేషాలు ఇవి.

- చిన్నప్పటి నుంచి నాకు నటన అంటే ఇష్టం. మంచి నటుడుగా పేరు తెచ్చుకోవాలనే కోరిక ఉండేది. మంచి బ్రేక్ కోసం ఎదురు చూశాను. అది 'మల్లేశం' రూపంలో వచ్చింది. ఇప్పటివరకూ చాలా సినిమాలు చేశాను. ఒక పెద్ద హిట్ పడితే అందరి దృష్టిలో పడతాను. 'రాజు యాదవ్' చిత్రంలో నా పాత్రకు మంచి పేరు వచ్చింది. సినిమా తేడాగా ఉండడంతో ఆడలేదు. ఒక్కోసారి మనం ఎంత బాగా చేసినా సినిమా ఆడకపోతే ప్రయోజనం ఉండదు కదా 'మల్లేశం' స్థాయి పాత్ర నాకు మళ్లీ 'అనగనగా ఒక అతిధి' సిరీస్‌లో వచ్చింది. అందులో నాలుగే నాలుగు పాత్రలు. అందులో తండ్రి పాత్ర కూడా నాకు మంచి పేరు తెచ్చింది.
- ఇంతకుముందు అడ్వర్‌టైజ్‌మెంట్ రంగంలో ఉన్నాను. యాడ్ ఫిల్మ్స్ డైరెక్ట్ చేశాను. ఇప్పుడు మాత్రం నటన మీదే దృష్టి పెట్టాను. నాకు ఇచ్చిన పాత్రకు పూర్తి న్యాయం చేకూర్చడానికి చాలా హోమ్ వర్క్ చేస్తుంటాను. ఆ పాత్రలో ప్రవేశించడానికి మానసికంగా స్ట్రగుల్ అవుతాను. అందరూ అలాగే చేస్తుంటారు కానీ నాకు కూడా ఆ గుణం ఉంది. అందుకేనేమో ఎమోషనల్ ఫాదర్ వేషం అంటే నాకే పిలుపు వస్తుంది.
- పాత రోజుల్లో నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్మించిన చిత్రాలన్నీ వదిలిపెట్టకుండా చూసేవాణ్ణి. ఆర్ట్ ఫిల్మ్స్‌తోనే నా నడక మొదలైంది కనుక ఆ తరహా చిత్రాలంటే చాలా ఇష్టం. ఆ రోజుల్లో షబానా అజ్మీ, నజీరుద్దీన్ షా, ఓంపురి, స్మితాపాటిల్ నటించిన సినిమాలు ఎక్కువగా వచ్చేవి. ఆ చిత్రాల ప్రభావం నా మీద బాగా ఉండేది. ఈమధ్య కాలంలో నవాజుద్దీన్, ఇర్ఫాన్ ఖాన్ వంటి నాచురల్ ఆర్టిస్టులు ఎంతో అద్భుతంగా నటిస్తున్నారు. పాత్రలో రాణించడానికి చాలా హోమ్ వర్క్ చేస్తారు. అవన్నీ చూసి ప్రేరణ పొంది, నాచురల్‌గా నటించడానికి కృషి చేస్తున్నాను. మెలో డ్రామా నాకు నచ్చదు.
- ప్రస్తుతం నాలుగు చిత్రాలు షూటింగ్ దశలో, మరో రెండు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. నిఖిల్ నటిస్తున్న 'స్వయంభూ'లో మంచి పాత్ర చేస్తున్నాను. అలాగే పర్యావరణం మీద చేస్తున్న 'గాంధీతాత జట్టు' కూడా నాకు మంచి పేరు తెస్తుందనే ఆశతో ఉన్నా.

డబుల్ ఫన్..థ్రిల్



విజయం సాధించిన 'మత్తు వదలరా' చిత్రానికి సీక్వెల్‌గా 'మత్తు వదలరా 2' వస్తోంది. శ్రీసింహా కోడూరి లీడ్ రోల్‌లో, సత్య సైడ్ కిక్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి రితేశ్ రానా దర్శకుడు. మైత్రీ మూవీస్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. ఫరియా అబ్దుల్లా, సునీల్, అజయ్, రోహిణి ఇతర ముఖ్య పాత్రధారులు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన అనంతరం హీరో శ్రీసింహా మాట్లాడుతూ 'డబుల్ ఫన్, థ్రిల్ ఉండేలా సెకండ్ పార్ట్ చేశాం. సెప్టెంబర్ 13న విడుదలవుతుంది' అని చెప్పారు. ఫస్ట్ పార్ట్‌లోనే ఒక ఐడియాను ప్లాంట్ చేసి దాని నుంచి డైరెక్ట్‌గా సీక్వెల్ చేశామని దర్శకుడు చెప్పారు.

ఇన్ ప్రోగ్రెస్

కోర్టు రూమ్ డ్రామా



త్రిగుణ్ ప్రధాన పాత్ర పోషించిన 'ఉద్వేగం' చిత్రం టీజర్‌ను రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. మహిపాల్ రెడ్డి దర్శకత్వంలో లుకలపు మధు నిర్మించారు. 'కోర్టు రూమ్ డ్రామాతో తెలుగులో చాలా తక్కువ చిత్రాలు వచ్చాయి. ఈ సినిమా టీజర్ చూసిన తర్వాత సిన్సియర్ ఎఫర్ట్ అనీ, అందరూ సహజంగా నటించారనీ అర్థమవుతోంది' అన్నారు రామ్‌గోపాల్ వర్మ. నటుడు ఆదిత్యకు, త్రిగుణ్‌కు ఇది 25వ చిత్రమనీ, చట్టాన్ని బేస్ చేసుకుని రూపొందించిన ఈ సినిమా విడుదల తేదిని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు.

పెళ్లి విందులు.. చిందులు



పెళ్లిలో జరిగే విందులు, చిందుల్ని కన్నుల విందుగా చూపిస్తున్న చిత్రం 'లగ్గం'. సాయిరోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటించిన ఈ చిత్రాన్ని వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. రమేశ్ చెప్పాల దర్శకుడు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన హీరో ఆది సాయికుమార్ యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'కథ, కథనం ఈ సినిమాకు బలం. ఫ్యామిలీ మెంబర్స్ అంతా కలసి చూసేలా సినిమా ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు. కథ నచ్చి ఈ సినిమా నిర్మించినట్లు నిర్మాత తెలిపారు. 'లగ్గం' సినిమా చేయడం తన అదృష్టం అని సాయిరోనక్ చెప్పారు.

డిసెంబర్‌లో విడుదల



వెట్రిమారన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి, సూరి ప్రధాన పాత్రలు పోషించిన 'విడుదల 2' చిత్రం రిలీజ్ డేట్ ఖరారైంది. డిసెంబర్ 20న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. గతంలో వచ్చిన 'విడుదల' చిత్రానికి ఇది కొనసాగింపు. గౌతమ్ వాసుదేవ్ మీనన్, అనురాగ్ కశ్యప్, మంజు వారియర్ కీలకపాత్రలు పోషించారు. ఎల్రెడ్ కుమార్ నిర్మాత. సంగీతం: ఇళయరాజా, సినిమాటోగ్రఫీ: ఆర్ వేల్రాజ్.

బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'హీరామండి'



ప్రతిష్ఠాత్మక బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'హీరామండి' వెబ్‌సిరీస్ నామినేట్ అయింది. ఉత్తమ ఓటీటీ ఒరిజినల్, ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగాల్లో ఇది నామినేట్ అయింది. బూసాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు తన సిరీస్ నామినేట్ అవ్వడం పట్ల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఆనందం వ్యక్తం చేశారు. 'ఈ చిత్రోత్సవాలకు రెండు విభాగాల్లో నామినేట్ అవ్వడం మా టీమ్‌కు గర్వకారణం' అని ఆయన సోషల్ మీడియాలో తెలిపారు. ఈ సారి ఇండియా నుంచి బూసాన్ చలన చిత్రోత్సవాలకు ఎంపికైన ఏకైక ప్రాజెక్ట్ గా 'హీరామండి' నిలిచింది. మనీషా కొయిరాలా, అదితీరావ్ హైదరీ, సోనాక్షి సిన్హా తదితరులు ప్రధాన పాత్రలు పోషించిన ఈ వెబ్‌సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై ప్రేక్షకాదరణ పొందింది.



కేకు కట్ చేసిన నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు

సీఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు

● వేతనం పెంపుదలపై హర్షం వ్యక్తం చేసిన నాయీ బ్రాహ్మణులు

మంగళగిరి, ఆగస్టు 30: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్న సీఎం చంద్రబాబుకు నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం నేతలు కృతజ్ఞతలు తెలియజేశారు. పాత మంగళగిరిలోని నాయిబ్రాహ్మణ సేవా కమ్యూనిటీ హాలులో శుక్రవారం వారు సమావేశమై దేవాలయాల కేశ ఖండన శాలల్లో పనిచేస్తున్న వృత్తిదారులకు వేతనాలను రూ.10 వేల నుంచి రూ.25 వేలకు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం నాయీబ్రాహ్మణ సాధికారసమితి సభ్యుడు మున్నంగి శివశేషగిరిరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయ పాలక మండళ్లలో నాయిబ్రాహ్మణులను సభ్యులుగా నియమించేందుకు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. క్షౌర దుకాణాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 50 ఏళ్లు నిండిన వృత్తిదారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నేతలు కొక్కెరపాటి పూర్ణచంద్రరావు, తెంపల్లి శివశంకరరావు, మున్నంగి చంద్రశేఖర్ రావు, తెంపల్లి దుర్గారావు, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపకారవేతనాల దరఖాస్తుల పంపిణీ

మంగళగిరి, ఆగస్టు 30: మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతియేటా విద్యార్థులకు పంపిణీ చేసే ఉపకార వేతనాలకు సంబంధించి ఆదివారం దరఖాస్తులు అందజేయనున్నట్లు సొసైటీ కార్యదర్శి ప్రెగడ రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షరాబ్‌బజారులోని మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తులు అందజేస్తామని, ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుకునే పేద చేనేత కుటుంబాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీల కుల వృత్తులను ఆధునికీకరించాలి

మంగళగిరి సిటీ, ఆగస్టు 30: బలహీనవర్గాలకు చెందిన రజక, నాయీ బ్రాహ్మణ, కుమ్మరి, కమ్మరి, చేనేత, గీత వంటి కుల వృత్తులను ఆధునికీకరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బీసీ కులాలు ఉత్పత్తి కులాలుగా ప్రాచీన కాలంలో సామాజిక మనుగడకు, ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డాయన్నారు. ఆధునిక పెట్టుబడిదారీ యుగంలో దేశంలోని అన్ని ప్రాంతాల్లో బీసీ వృత్తులకు ముప్పు వాటిల్లిందని, కార్పొరేట్ శక్తుల రంగ ప్రవేశంతో సాంకేతికత, ఆధునిక యంత్ర పరికరాలను అందిపుచ్చుకోలేక, మార్కెట్‌లో పోటీని తట్టుకోలేక బీసీ కుల వృత్తులు ఒక్కొక్కటిగా మూలన పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కుల వృత్తులను కాపాడుకునేందుకు ఆధునిక సాంకేతికతతో కూడిన ఉత్పత్తి పరికరాలను ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై అందజేసి బీసీ కుల వృత్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కేసన శంకరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు.

బాల్య వివాహాలతో అన్నివిధాలా నష్టం

తుళ్లూరు, ఆగస్టు 30: బాల్య వివాహాలతో అన్ని విధాలుగా నష్టం కలుగుతుందని అంగన్వాడీ సూపర్‌వైజర్ సీతారావమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఐనవోలు జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాసు ఆధ్వర్యంలో 'బాల్య వివాహాలు - నష్టాలు'పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. చదువుకునే సమయంలో వివాహ వయస్సు రాకుండా పెళ్లిల్లు జరిగితే కలిగే నష్టాలు కష్టాలను తెలియజేశారు. సమాజంలో బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు,ఆశాలు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

పెదనందిపాడు, ఆగష్టు, 30 : అర్హులైన వారు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని తహసీల్దారు శంకర్‌బాబు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం బీఎల్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నివాసం లేని వారిని, మరణించిన వారిని గుర్తించి ఓటరు లిస్టులో తొలగించాలని సూచించారు. అనంతరం గతంలో ఎన్నికల్లో విధులు నిర్వహించిన సిబ్బందికి నగదు అందజేశారు.

తెలుగులో కోర్టు తీర్పు

మంగళగిరి, ఆగస్టు 30: మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె సురేష్‌బాబు ఓ క్రిమినల్ కేసులో అచ్చ తెలుగులో తీర్పు వెలువరించి తెలుగు భాషపై అభిమానాన్ని చాటుకుని న్యాయవాదుల, సిబ్బంది, కక్షిదారుల మన్ననలు పొందారు. ఓ చోరీ కేసు విచారణలో వాదోపవాదాల అనంతరం నిందితుడి నేరం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ న్యాయాధికారి అచ్చ తెలుగులో తీర్పును వెలువరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా

● ప్రతిష్టాత్మకంగా వనం-మనం కార్యక్రమం ప్రారంభం



మొక్కలు నాటుతున్న కమిషనర్ అలీమ్ బాషా, టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, ఆగస్టు 30: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా పిలుపునిచ్చారు. మిషన్ హరితాంధ్రప్రదేశ్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనం-మనం కార్యక్రమాన్ని శుక్రవారం రాజీవ్ గృహకల్పలోని రజక కమ్యూనిటీ హాలు వద్ద నిర్వహించారు. ఎంటీఎంసీ అధికారులు, టీడీపీ నాయకులు మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా కమిషనర్ అలీమ్ బాషా మాట్లాడుతూ భావితరాలకు మనమిచ్చే ఆస్తి స్వచ్ఛమైన పర్యావరణమే కావాలన్నారు. మంత్రి నారా లోకేశ్ సూచన మేరకు ఎంటీఎంసీ పరిధిలో వున్న పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణను బాధ్యతగా స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనరు డి.శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనరు లక్ష్మీపతిరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, మండల అధ్యక్షుడు తోట పార్థసారధి, నేతలు గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, అబ్దుల్ మజీద్, వాకా మాధవరావు, కారంపూడి అంకమ్మరావు, మల్లవరపు వెంకట్, చావలి ఉల్లయ్య, ఆకురాతి లక్ష్మణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లి: తాడేపల్లి నులకపేటలోని మదర్సాలో వన మహోత్సవం సందర్భంగా వక్ఫ్ సర్వే కమిషనర్ షరీన్‌బేగం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మొక్కల ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మదర్సా నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకుమాను: పర్యావరణ పరిరక్షణకు మొక్కలను విరివిగా నాటాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వనమహోత్సవంలో భాగంగా 4100 మొక్కలను నాటినట్లు తెలిపారు. నాటిన మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివకుమారి, ఎంఈవో -2 విజయభాస్కర్, ఈవో పీఆర్డీ జవహర్‌లాల్ నెహ్రూ, ఏపీవో సింగారావు, పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, అధికారులు పలువురు పాల్గొన్నారు. అలాగే మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో వన మహోత్సవ కార్యక్రమాన్ని పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సచివాలయాల సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పెదనందిపాడు: మొక్కలు నాటి వాటిని పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడుదామని ఇన్‌చార్జి ఎంపీడీవో సాయిలీల అన్నారు. ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని గ్రామాల్లో ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద ఎంపీపీ ముద్దన నగరాజకుమారి, అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో సాంబశివరావు, కార్యదర్శి నాగయ్య, పాఠశాల హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం : ఫిరంగిపురంలోని కార్మెల్‌మాత కొండ వద్ద ఘన వ్యర్థ పదార్థాల షెడ్డు ప్రాంతంలో ఎంపీపీ సహేల నర్గీస్ మొక్కలు నాటారు. వేములూరిపాడు గ్రామ ఎస్సీ కాలనీ పాఠశాల ఆవరణలో సర్పంచ్ కొరివి చినఅనంత్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కటికల రామకోటేశ్వరరావు, పచ్చల రత్నరాజు, సయ్యద్ రబ్బానీలు మొక్కలు నాటారు. అలాగే 113 తాళ్ళూరులో ఎంపీపీ పాలపాటి వెంకటరావు, కొండలు, ఏపీవో మొక్కలను నాటారు. ఆయా కార్యక్రమాల్లో ఈవో కొల్లి విష్ణు వర్ధన్, బీజేపీ నాయకులు గొర్రెపాటి చంద్రశేఖర్, జనసేన నాయకులు టీ.జ్యోతి, బేతపూడిలో ఫరూక్ అహమ్మద్, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడికొండ, ఆగస్టు 30: తాడికొండలోని 33 కేవీ ఫీడర్, రాజధాని అమరావతి ప్రాంతంలోని 33 కేవీ ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తాడికొండ విద్యుత్‌శాఖ ఏఈ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మోతడక, నిడుముక్కల, లచ్చన్నగుడిపూడి, రావెల, పాములపాడు, బేజాత్‌పురం, ముక్కామల గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆగా గ్రామాల విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

తాడేపల్లిలో కార్డెన్ సెర్చ్

తాడేపల్లి, ఆగస్టు 30: తాడేపల్లి మహానాడులో సుమారు 100 మంది సిబ్బందితో శుక్రవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరియైన పత్రాలులేని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని మొదటి హెచ్చరికగా విడుదల చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించామని, అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశామని తెలిపారు. అలాగే సస్పెక్ట్ షీట్, రౌడీషీట్ గతంలో గంజాయి కేసుల్లో దొరికిన నేరస్తులను తనిఖీ చేశామన్నారు. సరియైన పత్రాలు లేని 150 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు కళ్యాణ్‌రాజు, వినోద్, పలువురు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కింగ్‌కు వ్యాపారస్తులు సహకరించాలి

తాడికొండ, ఆగస్టు 30: తాడికొండ ప్రధాన రహదారిలో వ్యాపార సముదాయాలకు వచ్చే వినియోగదారులు వాహనాలు రోడ్డు మీద పార్కింగ్ చేయకుండా వ్యాపారస్తులు సహకరించాలని సీఐ కే.వాసు పేర్కొన్నారు. శుక్రవారం తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో తాడికొండ ప్రధాన రహదారిలో వ్యాపారాలు చేసే వారికి సీఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాజధాని అమరావతికి వివిధ పనుల మీద వచ్చేవారు రోజురోజుకు పెరుగుతున్నారన్నారు. వీఐపీలు, వీవీఐపీలు, జడ్జీలు, సచివాలయ అధికారులు వచ్చివెళ్తున్నారని, దీనివలన ట్రాఫిక్ పెరుగుతుందన్నారు. తాడికొండలో వ్యాపారసముదాయాలకు వచ్చే వినియోగదారుల వాహనాలు రోడ్డు మీద పార్కింగ్ చేయటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. వాహనాలు రోడ్డు మీద పార్కింగ్ చేయకుండా వ్యాపారస్తులు చర్యలు చేపట్టాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పెదనందిపాడు, ఆగస్టు 30 : పెదనందిపాడు-బాపట్ల రహదారిలో నాగులపాడు అడ్డ రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో నాగులపాడుకు చెందిన పుసులూరు కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. కృష్ణ నాగులపాడు పాలకేంద్రంలో పాలుపోసి తిరిగి వస్తుండగా, వరగానికి చెందిన ఆనంద్ ద్విచక్రవాహనంపై పెదనందిపాడు వైపు వస్తూ కృష్ణ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టాడు. కృష్ణ తలకు తీవ్ర గాయం కాగా గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.



ప్రత్తిపాడులో భారీ కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ నేతలు

తండ్రికి తగ్గ తనయుడు బాలకృష్ణ

● ఘనంగా నటనకు 50 సంవత్సరాల వేడుకలు

ప్రత్తిపాడు, ఆగస్టు 30: నటనలో తండ్రికి తగ్గ తనయుడు నందమూరి బాలకృష్ణ అని టీడీపీ రాష్ట్ర తెలుగురైతు మీడియా కో-ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. నందమూరి బాలకృష్ణ సినీ ప్రస్థానంలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్తిపాడు లోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులు భారీ కేకు చేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, జీడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి, కాకాని సురేష్ బాబు, చిన్నం శ్రీకాంత్, గొరిజవోలు వెంకటేశ్వరరావు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, కల్లూరి శ్రీనివాసరావు, మాకినేని జగన్ మోహన్, కాసు పెంటారెడ్డి, కల్లూరి వెంకట సుబ్బయ్య, వెలివెల్లి సుబ్బారావు, పాలేటి కృష్ణ, వలివేటి శంకర్, మదుసూదనరావు, సతీష్ పాల్గొన్నారు.

మంగళగిరి సిటీ: నందమూరి బాలకృష్ణ సినీ రంగ ప్రవేశం చేసి 50 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళగిరి టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో శుక్రవారం స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి, కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ బాలకృష్ణ 50 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బైరబోయిన శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, మండల అధ్యక్షుడు తోట పార్థసారధి, పట్టణ నేతలు పలువురు పాల్గొన్నారు.

'మా కాలనీ అంటే చిన్న చూపు'

● ఏ ఒక్క సమస్యనూ పట్టించుకోరు..

● తహసీల్దారు వద్ద గోడు వెళ్లబోసుకున్న ఎస్టీ కాలనీవాసులు

ప్రత్తిపాడు, ఆగస్టు 30: 'మా కాలనీలో కాలువలు ఎప్పుడు పూడిక తీశారో ఏమో.. నీరు మొత్తం నిల్వ ఉంటున్నాయి.. దోమలు విపరీతంగా పెరిగి పోయాయి.. వీధి దీపాలు వెలగటం లేదు.. రాత్రి పూట పాములు కూడా వస్తున్నాయి.. ఎన్ని సార్లు పంచాయతీకి చెప్పినా ఒక్కరు కూడా పట్టించు కోవడం లేదు.. మా కాలనీ అంటే చిన్న చూపు చూస్తున్నారు' అంటూ ప్రత్తిపాడు ఎస్టీ కాలనీ వాసులు తహసీలారు రవిబాబు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు ఎస్టీ కాలనీలో శుక్రవారం అధికారులు పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తమ సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రామకోటయ్య, ఎంఈవో రమాదేవి, సీడీపీవో సుజాతాదేవి, ఆర్ఐ సాహితి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

తాడికొండ, ఆగస్టు 30: ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్టీఆర్ సమాజిక పింఛన్ల పంపిణీని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనిలో భాగంగా సెప్టెంబరు 1వ తేదీన ఆదివారం సెలవుదినం కావటంతో ఆగస్టు 31వ తేదీనే సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో ఎం.దీప్తి ఈ సందర్భంగా తెలిపారు.

పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు దూరం

మంగళగిరి సిటీ, ఆగస్టు 30: ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు దరిచేరకుండా రక్షణ పొందవచ్చని ఎంటీఎంసీ కమిషనరు అలీమ్ బాషా సూచించారు. ఇందిరానగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏపీఎస్పీ గేటు పరిసర ప్రాంతాల్లో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలిసి కమిషనర్ నివాస గృహాలకు వెళ్లి నీటి నిల్వలను పారబోశారు. వర్షాకాల సీజను కావడంతో మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధులు రాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని, వ్యాధి లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లో వైద్యం పొందాలని మెడికల్ ఆఫీసర్ అనూష సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనరు కే.శకుంతలాదేవి, అసిస్టెంట్ కమిషనరు లక్ష్మీపతిరావు, ఎంపీహెచ్‌వో వెంకటేశ్వరరావు, పారిశుధ్య కార్యదర్శి రాజశేఖర్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లపై వేప కషాయం పిచికారీ చేయండి

దుగ్గిరాల, ఆగస్టు 30: ఆకుముడత, రెక్కపురుగుల గుడ్లను లార్వా దశలోనే నాశనం చేసేందుకు వేపకషాయం పిచికారీ చేయాలని ఏడీఏ ఉషారాణి అన్నారు. మండలగ్రామం గొడవర్రులో వరిక్షేత్రాలను సందర్శించిన ఏడీఏట ఎస్. ఉషారాణి రైతులకు కొన్ని సూచనలు చేశారు. ప్రధానంగా వేపగింజల కషాయం తయారీ, దాని పిచికారీ, లార్వాదశలోనే పిచికారీ చేయడం ద్వారా పంటకు తెగుళ్ల ఆశించకుండా ఏవిధంగా కాపాడుకోవచ్చుననే పలు అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో శిరీష తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్లలో నిలిచిన ఇసుక లోడింగ్

తుళ్లూరు , ఆగస్టు 30 : వర్షం కారణంగా లింగాయపాలెం, తాళ్లాయపాలెం స్టాక్ పాయింట్‌ల వద్దకు వరద నీరు చేరుకోవడంతో ఇసుక లోడింగ్ నిలిచిపోయింది. ఇసుక లోడింగ్ కోసం వచ్చిన వాహనాలు దిగబడిపోయి బయటకు రాని పరిస్థితి ఏర్పడటంతో లోడింగ్ పనులను అధికారులు నిలిపివేశారు. 4వ తేది వరకు వినియోగ దారులు ఇప్పటికే ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొని ఉండగా, వరద తగ్గుముఖం పట్టగానే లోడింగ్ పనులు ప్రారంభిస్తామని అధికారులు చెపుతున్నారు.

ఘనంగా వీటీజేఎం కళాశాల

వ్యవస్థాపక దినోత్సవం

మంగళగిరి, ఆగస్టు 30: మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 48వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గొడవర్తి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వమించిన ఈ కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకుల చిత్రపటాలకు కమిటీ సభ్యులు నివాళులు అర్పించారు. కళాశాల మాజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ గోలి రామమోహనరావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలోనే మొట్టమొదటి డిగ్రీ కళాశాలగా వీటీజేఎం నిలిచిందన్నారు. పేద విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యనందిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీకే జూనియర్ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ జంజనం పాండురంగారావు, మునిసిపల్ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, వీటీజేఎం కళాశాల కరస్పాండెంట్ వెనిగళ్ల వెంకట తాతారావు, అధ్యక్షుడు ఇనునూరి చంద్రమోహన్, డీన్ దామర్ల నరసింహం, డాక్టర్ కొల్లి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు, పూర్వ అధ్యాపకులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న, వేదికపై చైర్‌పర్సన్ రాధిక, ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల తదితరులు

పరిసరాల పరిశుభ్రతను పాటించండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఆగస్టు 30: పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం డ్వాక్రా మహిళలకు మున్సిపల్ ఆరోగ్యశాఖ, మలేరియా, ఫైలేరియా శాఖల ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్నలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, దోమల ద్వారా వ్యాపించే వివిధ రకాల వ్యాధులైన డెంగీ, మలేరియా, మెదడువాపు వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని, దోమతెరలు వాడాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటించి, నీటి నిల్వలను వారానికి ఒకసారి మార్చాలని, కాచిచల్లార్చిన నీరు తాగాలని, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినరాదని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కారుమూరి హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, దాసరి విజయ్‌కుమార్, ఏఎన్ఎం సౌజన్య, నవీద్, షైలా అప్పారావు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మ అమ్మవారికి ఆలపాటి ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఆగస్టు 30: శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని 8వ వార్డు మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండి ప్రజలందరూ సంతోషంగా జీవించేలా మహాలక్ష్మి అమ్మవారు ఆశీర్వదించాలని వేడుకున్నట్లు ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. ఆలపాటికి ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించి అమ్మవారి ప్రత్యేక పూజల అనంతరం దుశ్శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. పలువురు టీడీపీ శ్రేణులు, భక్తులు పాల్గొన్నారు.



నందీశ్వరుని పూజలు చేస్తున్న భక్తులు

శివాలయంలో నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

తెనాలి అర్బన్, ఆగస్టు 30: చినరావూరు శివాలయంలో నందీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీబాలత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అర్చకులు ఈశ్వర్ మాట్లాడుతూ, అమావాస్యకు ముందు వచ్చే శనిత్రయోదశి కూడా ఎంతో పవిత్రమైనదన్నారు. శనివారం 31న నందీశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించాలని కోరారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్, ఆగస్టు 30: ప్రతిభ కలిగిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామని వడ్లమూడి కోటయ్య చౌదరి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి గోవర్ధనరావు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో 80 శాతం పైగా మార్కులు, ఎంసెట్‌లో 25 వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు, ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సులు చదివేవారు 75శాతం పైగా మార్కులు సాధిస్తే ఉపకార వేతనాలకు అర్హులని చెప్పారు. సెప్టెంబరు 1 నుంచి 15వ తేదీ వరకు ఈ అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు వడ్లమూడి కోటయ్య చౌదరి చారిటీస్, డోర్ నెం2-4-27 కాజావారి వీధి, గాంధీ నగర్, తెనాలి, గుంటూరు జిల్లా చిరునామాకు దరఖాస్తులను సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో పంపాలన్నారు. లేదా సంస్థ వెబ్‌సైట్ వీకేసీచారిటీస్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరాలకు ఫోన్ 9885890122లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా సీతారామ లక్ష్మణ విగ్రహాల ప్రతిష్ఠ



తూములూరులో సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

కొల్లిపర, ఆగస్టు 30: మండల పరిధిలోని తూములూరు ఎస్టీ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ మందిరంలో శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జ్యోతిష పండితులు శ్రీమాన్ నారాయణం రోజాగోపాలచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 11.02 గంటలకు శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను వేదమంత్రాలతో పండితులు, భక్తులు ప్రతిష్ఠ చేశారు. ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచి ఆలయం ఎదుట అర్చకుల హోమాలతో, వేద మంత్రోచ్చరణతో మార్మోగింది. పండితులు విష్వక్సేన పూజ, పుణ్యాహం, పూర్ణాహుతి, ప్రాణప్రతిష్ఠా, గోదర్శనం వంటి పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠా మహోత్సవానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రతి ఒక్కరం మొక్కలు నాటి సంరక్షిద్దాం

● పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్
● మండల వ్యాప్తంగా 10వేలు మొక్కలు
● ఎరుకలపూడిలో మొక్కలు నాటిన మంత్రి



వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటుతున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, ఆగస్టు 30: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని తద్వారా భావితరాలకు ఆహ్లాదం, ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించిన వారవుతారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎరుకలపూడి గ్రామంలో చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమానికి మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల ఆలోచన మేరకు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. వనమహోత్సవం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షిస్తూ పచ్చదనానికి పర్యావరణ పరిరక్షణకు నిలయంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేలా కార్యచరణతో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. తెనాలి ప్రాంతంలో పట్టణ, గ్రామాల్లో మొక్కలు నాటడం ద్వారా భావితరాలకు మంచి ఆహ్లాదకర వాతావరణం అందించిన వారమవుతామన్నారు. మండలంలో 10వేల మొక్కలు నాటేలా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. సెప్టెంబరు 2న డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని వివిధ మొక్కలు నాటే కార్యక్రమానికి పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. అందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మనోహర్ పిలుపునిచ్చారు. తొలుత స్కూల్ విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. పలువురు గ్రామ పెద్దలు, పలు శాఖల అధికారులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని 18 గ్రామాల్లో వన మహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టారు. అయా గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు కలిసి వివిధ రకాల మొక్కలు నాటారు. గ్రామంలో మొక్కల పెంపకంపై ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో...

చేబ్రోలు, పొన్నూరు టౌన్, ఆగస్టు 30: వనాలను సంరక్షిస్తే మానవ సంరక్షణ చేసినట్లేనని నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు అన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నారాకోడూరు గ్రామంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాల అవరణతో పాటు గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వన సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి తన జన్మదినం రోజున ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజారెడ్డి, బి.వెంకటేశ్వరరావు తదితరులతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పొన్నూరు పట్టణంలోని పురపాలక సంఘం పరిధిలో పలు వార్డుల్లో స్థానికులు, మహిళలు మొక్కలు నాటి వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించి, స్థానికులకు రహదారుల వెంట ఉన్న మొక్కల సంరక్షణ బాధ్యతను అప్పగించారు.

ముగిసిన శ్రావణ శుక్రవార పూజలు

తెనాలి అర్బన్, ఆగస్టు 30: శ్రావణ శుక్రవారం చివరి రోజు పట్టణంలోని ఆలయాలలో నిర్వహిస్తున్న పూజలు ముగిశాయి. మారీసుపేటలోని అప్పలస్వామి ఆలయంలో గణపతి పూజ, మండపారాధన, చండీహోమం నిర్వహించారు. ప్రదోష సమయంలో మహిళ భక్తులు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. అమ్మవారి వెండి డాలర్‌ను భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. ధర్మకర్త నారాయణస్వామి, శివానందకుమార్, శివాంజనేయ ప్రసాద్, వెంకటేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. మారీసుపేట శివాలయంలో అమ్మవారిని సంతానలక్ష్మిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. టీబీ రోడ్డులోని విశ్వకర్మ ఆలయంలో కామాక్షి అమ్మవారిగా అలంకరించారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో అమ్మవారికి జరిగిన ప్రత్యేకపూజల్లో భక్తులు పాల్గొన్నారు..

● కొల్లిపర, ఆగస్టు 30: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని దేవాలయాల్లో పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు సామూహికంగా వరలక్ష్మీ వ్రతాన్ని చేశారు. పండితులు మహిళలతో కలశ పూజలు చేయించి వరలక్ష్మీవ్రతం గురించి తెలియజేశారు. మండల కేంద్రం కొల్లిపర శ్రీగంగా పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి, శ్రీజనార్దనస్వామి ఆలయాల్లో, శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో పండితులు జగన్నాథాచార్యులు, కుమారస్వామి, కుటుంబరావులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలతో వరలక్ష్మి వ్రతాన్ని చేయించి వ్రత సంకల్పం గురించి తెలియజేశారు.

పెదకాకానిలో వరలక్ష్మి వ్రతాలు



హోమాల్లో పాల్గొన్న భక్తులు

పెదకాకాని, ఆగస్టు 30: పెదకాకాని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రావణమాస చివరి శుక్రవారం సాముహిక శ్రావణమాస వరలక్ష్మీ వ్రతాలు దేవస్థాన కల్యాణ మండపంలో నిర్వహించారు ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు ఆధ్వర్యంలో అర్చకస్వాములు, వేదపండితులతో శాస్త్రోక్తంగా ఈ వ్రతాన్ని నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఉదయం సామూహిక శ్రావణమాస వరలక్ష్మీ వ్రతాలు ప్రారంభించారు. భ్రమరాంబ అమ్మవారికి లక్ష గాజులతో ప్రత్యేక అలంకారం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వ్రతపూజలలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారని ఆలయ ఉపకమిషనరు డి.శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. గుంటూరు-2 నియోజకవర్గ శాసనసభ్యురాలు గల్లా మాధవి వరలక్ష్మీ వ్రత పూజలో పాల్గొన్నారు. ఆలయ ఉప కమిషనరు డి.శ్రీరామవరప్రసాదరావు గౌరవ శాసనసభ్యురాలికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ వేదపండితులు వేద ఆశ్వీరవచనము చేయగా ఆలయ ఉపకమిషనరు స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదము, చిత్రపటము అందజేశారు. వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న ముత్తయిదువులకు దేవస్థానం వారిచే పసుపు, కుంకుమ, జాకెట్ ముక్క, అష్టలక్ష్మి దేవి రూపు, కంకణం అమ్మవారి ప్రసాదంగా అందజేశారు. పూజ అనంతరం దేవస్థాన అన్నప్రసాద భవనంలో అన్నదానం జరిగింది.



పుష్పాలంకరణలో ప్రత్యేక పూజలందుకున్న కనకదుర్గా భవానీ అమ్మవారు



ప్రత్యేకంగా లక్ష గాజులతో అలంకరణలో పెదకాకాని భ్రమరాంబ అమ్మవారు

కనకదుర్గా భవానీకి పుష్పాభిషేకం

పొన్నూరు టౌన్, ఆగస్టు 30: పవిత్ర శ్రావణ మాసం చివరి శుక్రవారంను పురస్కరించుకుని పట్టణంలోని కనకదుర్గా భవానీ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి వేకువజామున పంచామృత అభిషేకాలు జరిపారు. వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో మహిళలతో కోటి నామ కుంకుమార్చన జరిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని తోటమ్మ తల్లి ఆలయం, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో శ్రావణ మాస శుక్రవార పూజలు జరిగాయి.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలి

● మాజీ సర్పంచ్ దొడ్డక ఆదినారాయణ

తెనాలి అర్బన్, ఆగస్టు 30: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని మాజీ సర్పంచ్ దొడ్డక ఆదినారాయణ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన వన మహోత్సవం పురస్కరించుకుని జగ్గడిగుంటపాలెంలో శుక్రవారం మొక్కలు నాటారు. కేంద్రీయ విద్యాలయం ఐటీఐ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మొక్కల అవశ్యకతను వివరిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవలో కూడా పాలు పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రవికుమార్, శ్రీనివాస్, ప్రసాద్, యుగంధర్ పాల్గొన్నారు.

ప్రతిష్ఠామూర్తులకు ప్రత్యేక పూజలు

పొన్నూరు టౌన్, ఆగస్టు 30: మండల పరిధిలోని కసుకర్రులో ప్రతిష్ఠించనున్న సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామ ప్రతిష్ఠా మూర్తులకు శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. గోపూజ నిర్వహించి మహాశాంతి హోమం జరిపారు. ప్రతిష్ఠా మూర్తులకు పంచామృత అభిషేకాలు చేసి దాన్యాధివాసం చేశారు. సాయంత్రం దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. రాత్రికి మండపారాధన, శయ్యాధివాసం చేశారు. శనివారం శాంతి కల్యాణం, ప్రతిష్ఠ, అన్నసంతర్పణ కార్యక్రమం శాంతి కల్యాణం జరగనున్నాయి.

పొన్నూరు రూరల్ ఎస్ఐగా కిరణ్ బాబు



పొన్నూరు టౌన్, ఆగస్టు 30: పొన్నూరు రూరల్ ఎస్ఐగా గండు కిరణ్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కిరణ్‌బాబు నెల్లూరు నుంచి గుంటూరు వీఆర్‌కు బదలీపై వచ్చి అక్కడి నుంచి పొన్నూరు బదిలీపై వచ్చారు. పొన్నూరు ఎస్ఐగా పనిచేసిన బండ్ల భార్గవ్ రేపల్లె బదలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గండు కిరణ్‌బాబును సహచర సిబ్బంది అభినందించారు.



పాల రైతులకు బోనస్ పంపిణీ చేస్తున్న డైరెక్టర్ రామారావు

సంగం రైతులకు బోనస్ పంపిణీ

పొన్నూరు టౌన్, ఆగస్టు 30: సంగం డెయిరీ ప్రగతి చక్రాలు పాల ఉత్పత్తిదారులేనని సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు అన్నారు. శుక్రవారం వెండార్లు సొసైటీల పరిధిలో రైతులకు బోనస్ పంపిణీ కార్యక్రమం జరిగింది. తోట రామచంద్రయ్య వెండార్ పాయింట్‌లో 44మంది పాల రైతులకు రూ.1,44,719లు బోనస్‌ను పంపిణీ చేశారు. తోట హైమావతి వెండార్‌లో 39మంది పాల రైతులకు రూ. 1,28,492 బోనస్‌ను అందించారు. పెదపాలెం సొసైటీలో 31మంది రైతులకు రూ. 48,650, పెదఇటికంపాడు సొసైటీలో 56మంది రైతులకు రూ.55,455 బోనస్‌ను అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ రామారావు మాట్లాడుతూ సంగం డెయిరీ అభివృద్ధిలో భాగస్వాములైన రైతుల సంక్షేమం కోసం చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పాటుపడుతున్నారన్నారు. అలాగే రైతుల సంక్షేమం కోసం డీవీసీ అభయ సంక్షేమ పథకాలను అమలు చేస్తునట్లు వివరించారు. కార్యక్రమంలో అప్పికట్ల చిల్లింగ్ సెంటర్ మేనేజర్ కాట్రు నరేష్‌బాబు, సూపర్‌వైజర్ టి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

● కొల్లిపర: రైతులు పాడిపరిశ్రమను మరింత అభివృద్ధి చేసుకోవాలని సంగం డెయిరీ సూపర్‌వైజర్ కస్తూరి హరిపోతురాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నవరంలంక పాలకేంద్రంలో బోనస్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి పాలకేంద్రం అధ్యక్షుడు అద్దేపల్లి రమేష్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హరిపోతురాజు మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను కూడా లాభసాటిగా మార్చుకోవాలన్నారు. అనంతరం 36మంది రైతులకు 43వేల రూపాయలను బోనస్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జంపనీ ఎంసీసీ ఇన్‌చార్జి రామకృష్ణ, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ సందీప్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● ఎంపీపీ భీమవరపు పద్మావతి

కొల్లిపర, ఆగస్టు 30: భావితరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపరలో వన మహోత్సం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి ఆమె శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. ప్రాణవాయులను అందిస్తున్న మొక్కలను పెంచడం భవిష్యత్తు తరాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అదేవిధంగా మండలంలోని గ్రామాల్లో కూటమి నాయకులు వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు. ఆయా కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీడీవో విజయలక్ష్మి, పరిపాలనాధికారి చంద్రమోహన్, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు, కూటమి నాయకులు అవుతు నారాయణరెడ్డి, ఆళ్ళ వీరారెడ్డి, ఆళ్ళ సురేష్‌రెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, యర్రు వెంకయ్యనాయుడు, దివ్వెల ఏడుకొండలు, దాసరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు

తెనాలి రూరల్, ఆగస్టు 30: ప్రేమించి పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్న భర్త మద్యానికి బానిసై తనను హింసిస్తున్నాడని భార్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని నందివెలుగు గ్రామానికి చెందిన వసుంధరాదేవి కొలకలూరు గ్రామానికి చెందిన సాయి ఇరువురు ప్రేమించుకున్నారు. ఇరు కుటుంబాల్లో వారి ప్రేమ విషయాన్ని తెలిపి వారి సమ్మతితో 10ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు చిన్నారులు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించే సాయి మద్యానికి బానిసయ్యాడు. ఉదయం నుంచి సాయంత్ర వరకూ ఆటోనడపగా వచ్చిన డబ్బులతో మద్యంతాగి తరుచూ భార్యను చిత్రహింసలకు గురిచేస్తుండటంతో ఆమె పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

రేషన్ డీలర్ ఆకస్మిక మృతి

పొన్నూరు టౌన్, ఆగస్టు 30: పొన్నూరు పట్టణానికి చెందిన సీనియర్ రేషన్ డీలర్, టీడీపీ సానుభూతిపరుడు షేక్ అబ్దుల్ గఫూర్ శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. పట్టణానికి చెందిన గఫూర్ సుదీర్ఘకాలంగా రేషన్ డీలర్‌గా కిరోసిన్ హాకర్‌గా పనిచేశారు. గఫూర్‌కు భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గఫూర్ మృతి వార్త తెలుసుకున్న పొన్నూరు పట్టణానికి చెందిన రేషన్ డీలర్లు, పట్టణ ప్రముఖులు గఫూర్ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబాన్ని పరామర్శించారు.



ప్రత్యేక పూజలందుకున్న స్వర్ణ వెంకటేశ్వర స్వామి

నయనానందకరంగా వసంతోత్సవం

పొన్నూరు టౌన్, ఆగస్టు 30: పట్టణంలోని శ్రీ స్వర్ణ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి వసంతోత్సవం నయనానందకరంగా జరిగింది. బ్రహోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత స్వర్ణ వెంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంతోత్సవ కార్యక్రమాని కోలాహలంగా జరిపారు. ఆలయ పుష్కరిణిలో చక్రస్నానం చేశారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం ధ్వజావరోహణం చేశారు. సాయంత్రం ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవచేసి పవళింపు సేవలు జరిపారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ పట్టీ

పెదకాకాని, ఆగస్టు 30: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న శ్రీదశావతార వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి భక్తులు శ్రావణపట్టీని సమర్పించారు. శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా శుక్రవారం గుంటూరు చెందిన పోసాని శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ పట్టీ సమర్పించినారు. అనంతరం జరిగిన ప్రత్యేక పూజలు పాల్గొని స్వామి గారికి ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కర్‌రావు దంపతులు, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక పూజకు తీసుకొచ్చిన పూలతో భక్తులు